



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న పవన్ కళ్యాణ్



- రూ.15వేల కోట్ల ప్రతిపాదనలకు ముందడుగు
- ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి నిధులు
- రాజధాని నిర్మాణ ప్రణాళికల రూపకల్పనకు ప్రభుత్వం ఆదేశాలు
- ఆదివారం జీవో జారీ చేసిన పురపాలక శాఖ

అమరావతి అభివృద్ధి పరుగులు

రాజధాని అమరావతి నిర్మాణం ఇకపై పరుగులు పెట్టనుంది. రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి అందనున్న నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సీఆర్డీఏకు తాజాగా జీవో జారీ చేసింది. అమరావతి నగర అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన ప్రణాళికలు అమలు చేయాలని సీఆర్డీఏకు పురపాలక శాఖ ఆ జీవోలో పేర్కొంది.

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధానిగా అ మరావతిని అభివృద్ధి చేయాలని, అందుకోసం చేపట్టాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఆర్డీఏను ప్రభుత్వం ఆదేశించింది. రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా రూ.15వేల కోట్ల రుణ సహకారాన్ని అందించనున్నట్లు ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆ నిధులతో రాజధానిలో అత్యున్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాల, వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండేలా సుస్థిరాభివృద్ధి కార్యచరణను చేపట్టాలని పేర్కొంది. రాజధానిలో ప్రధాన రహదారులు, తప్పనిసరి అవసరాలకోసం వినియోగించే యుటిలిటీ డక్ట్‌లు, వర్షపు నీరు, వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా డ్రెయిన్‌లు, వరద కాలువలు నిర్మించాలని జీవోలో స్పష్టం చేసింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ జోన్లలో హరిత క్షేత్రాలు ఏర్పాటుచేయాలని, 24 గంటలూ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మానవ వ్యర్థాలను నిర్వహించే సీవరేజ్ వ్యవస్థను నిర్మించాలని, హరిత నియమావళికి అనుగుణంగా ప్రభుత్వ భవనాలు నిర్మించాలని, భవనాల పటిష్టతను పెంపొందించాలని, అందుకనుగుణంగా కొత్త పద్ధతుల్లో నిధుల సమీకరణ పద్ధతులను అవలంభించాలని పురపాలక శాఖ సీఆర్డీఏకి తెలిపింది.

● సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు

రాజధాని అమరావతి సుస్థిరాభివృద్ధికి సీఆర్డీఏ ప్రతిపాదనలు సమర్పించగా కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి కూడా ఆమోదం లభించినట్లు తెలిపింది. ప్రోగ్రామ్ ఫర్ రిజల్ట్స్(పీ ఫర్ ఆర్), రిసల్ట్ బేస్డ్ లెండింగ్(ఆర్‌బీఎల్) కార్యక్రమాల కింద ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు చెరో 800 మిలియన్ డాలర్ల నిధులు అందించనున్నాయి. మిగిలిన నిధులు కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకోనున్నామని తెలిపింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం పొందేందుకు ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా దశలవారీగా బ్యాంకుల నుంచి నిధుల పొందే అవకాశం ఉండడంతో అందుకోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి నిర్మాణ ప్రణాళిక కోసం బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులతో పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మొత్తం కార్యక్రమం, ప్రణాళికలు సీఆర్డీఏ కమిషనర్ అదీనంలో జరగనున్నట్లు జీవోలో పురపాలక శాఖ స్పష్టం చేసింది.



సభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు తదితరులు

అటవీ సంరక్షణలో.. అధికారులకు స్వేచ్ఛ


- అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత
- భావితరాలు గుర్తుంచుకునేలా విగ్రహాల ఏర్పాటు
- భవనాలకు అమర వీరుల పేర్లు
- అటవీ సంపదను నాశనం చేస్తే కఠిన చర్యలు
- టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేసే అవకాశం
- చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు
- సరస్వతి భూముల్లో అక్రమాలపై విచారణ చేపడతాం
- అటవీ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిధులు, సిబ్బంది కొరతను అధిగమించి అటవీ శాఖను అభివృద్ధి పథంలో నిలుపుతాం. వనరులను పరిరక్షించి అటవీ సంపదను కాపాడి భవిష్యత్తుతరాలకు అందజేయడం బాధ్యతగా భావిస్తున్నాను. అడవుల రక్షణకు అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం. ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టేందుకు ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశాం. ఆ నంబర్‌కి కాల్ చేస్తే ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట వేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరు అరణ్య భవన్‌లో జరిగిన రాష్ట్ర అటవీ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని స్మారక స్థూపం వద్ద అటవీశాఖ ఉన్నతాధికారులతో కలసి అమర వీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల

(మిగతా 6వ పేజీలో..)



అమవీరుల కుటుంబసభ్యులకు పండ్లు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ఓడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రతిపాదిత స్థలం



సంక్షేమం.. అభివృద్ధి!

పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం కలగాలి

గుంటూరు ఛానల్ ఆధునీకీకరణ చేయాలనే డిమాండ్‌ను ఎప్పటి నుంచో రైతులు చేస్తున్నారు. ప్రస్తుతం 600 క్యూసెక్కుల సామర్థ్యాన్ని కలిగి 49 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్న దీనిని, 750 క్యూసెక్కులకు పెంచడంతో పాటు, మరో 22 కిలోమీటర్లమేర పొడిగించాలనే ప్రతిపాదనలు రైతుల నుంచి పలుసార్లు ప్రభుత్వానికి అందాయి. దీనికి సంబంధించి 2014–19 మధ్య టీడీపీ ఏలుబడిలో కొంతమేర కదలికి వచ్చింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనుల సంగతి మళ్లీ మొదటికొచ్చింది. దీని విషయంలో బడ్జెట్‌లో కేటాయింపులు దక్కుతాయనే ఆశలు రైతాంగం పెట్టుకుంది. నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనులకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. దాదాపు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న చీరాల మండలం వాడరేవు ఫిషింగ్ హార్బర్ పనులకు నిధుల పెంపు కూడా బడ్జెట్‌లో వరాలు కురుస్తాయనే ఆశతోప్రజలు ఉన్నారు

పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గరనుంచి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెబుతోంది. అది ఆచరణ దాల్చే విధంగా తొలి అడుగు బడ్జెట్ పద్దు ద్వారా పడాల్సి ఉంది. ఇప్పటికే సూర్యలంక తీరంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం వంద కోట్ల నిధులు మంజూరు చేయగా, వాటి వినియోగంపై స్పష్టత రావాల్సి ఉంది. సమాంతరంగా చీరాల పరిధిలోని తీర ప్రాంత అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తే పర్యాటక రంగ పరంగా జంటనగరాలుగా ఇవి వర్ధిల్లే అవకాశం ఉంది

కరకట్టల పటిష్టత కోసం...

తాజాగా కృష్ణానదికి వచ్చిన వరదల వల్ల జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని బతకాల్సి వచ్చింది. ఐదేళ్లలో కరకట్టలకు కనీస మరమ్మతులు కూడా వైసీపీ ప్రభుత్వం చేయకపోవడంతో అవి ఎక్కడికక్కడ లీకులు ఇచ్చి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇదే కాకుండా చివరికి ఆ కరకట్టల వద్ద మట్టి తవ్వకాలు జరిపి యథేచ్ఛగా గత పాలకులు దోచుకోవడంతో ప్రస్తుతం వాటి మనుగడే ప్రశ్నార్థకం అయింది. సెప్టెంబరులో కృష్ణానదికి అసాధారణంగా వచ్చిన వరదల వల్ల పలు చోట్ల కరకట్టలకు గండిపడడం వాటిని పూడ్చడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. వరదలు తగ్గుముఖం పట్టగానే కరకట్టల పటిష్టత కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పనులు చేపడతామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఆ దిశగా అడుగులేయడానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సముచితంగా జరగాల్సి ఉంటుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
ఐదేళ్ల పాటు జిల్లాలో అభివృద్ధి మచ్చుకైన కానరానీయకుండా వైసీపీ పాలన నడిచింది. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించే కీలక ప్రాజెక్టుల విషయంలోనూ ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శించింది. వివిధ ప్రాజెక్టుల పూర్తికి కేంద్రం ఇచ్చిన నిధులను సైతం యథేచ్ఛగా దారి మళ్లించిన ఘనత వైసీపీది. ఐదేళ్లలో జిల్లాకు

- **అసెంబ్లీలో నేడు బడ్జెట్ సమర్పణ**
- **జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించే అవకాశం**
- **గుంటూరు ఛానల్ ఆధునికీకరణపైనా ఆశలు**
- **విద్య, ఆరోగ్య పథకాలకు కూడా దక్కనున్న సముచిత స్థానం!**

బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో మొండిచెయ్యే గత ప్రభుత్వం చూపింది. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పూర్తి స్థాయి బడ్జెట్‌ను సోమవారం ఉభయసభల్లో ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ఎంతమేర నిధులు అవసరం అవతాయి అనే అంశంతో పాటు నూతనంగా చేపట్టాల్సిన పనుల విషయంలో ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి వినతుల రూపంలో ప్రజాప్రతినిధులు అందించడం జరిగింది. అభివృద్ధికి నిధుల కేటాయింపుతో పాటు సూపర్‌సిక్స్ పథకాల అమలుకు జిల్లా వ్యాప్తంగా కావాల్సిన నిధుల లెక్కలను గతంలోనే అధికారులు అందించారు. వీటన్నింటిని క్రోడీకరించుకుని బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధి సమతూకం కనబడేలా నిధుల కేటాయింపులు జరగనున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. మరోవైపు అసెంబ్లీ సమావేశాలకు జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలందరూ హాజరు కానున్నారు

వైద్యం....విద్య రంగాల కోసం...

జిల్లా కేంద్రమయిన బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను గత ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ పనులను నిలిపివేశారు. నాబార్డ్ నిధుల విషయంలో దుర్వినియోగం జరిగిందనేది కూటమి పాలకుల విమర్శగా ఉంది. ఆ నిధులు ఎంతమేర కేటాయింపులు జరిగాయి, ఖర్చు పెట్టింది ఎంత అనే వివరాలతో పాటు దానిని పూర్తి చేయడానికి అయ్యే వ్యయం ఎంత వంటి అంశాలతో బడ్జెట్ సమావేశాల్లో నివేదిక ఇచ్చి అందుకు అనుగుణంగా కేటాయింపుల జరిపి పనులు ప్రారంభించాల్సిన అవశ్యకత ఉంది. అదే విధంగా విద్య విషయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు పెద్ద పీటే వేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతూ వస్తోంది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో ఒక్క కళాశాల కూడా లేకపోవడం గమనార్హం. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాలో నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థల ఏర్పాటు కోసం నిధుల కేటాయింపు జరిగితే ప్రభుత్వం ఉద్దేశం నెరవేరే అవకాశం ఉంది

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం....

హడావిడిగా జిల్లాల ఏర్పాటు అయితే గత ప్రభుత్వం చేపట్టింది కానీ అందుకు కావాల్సిన మౌలిక వసతుల మీద దృష్టి పెట్టకపోగా కనీస కేటాయింపులు కూడా జరపలేదు. ముఖ్యంగా అన్ని కార్యాలయాలు ఒకే చోట కొలువుదీరేలా సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేపడతామని, అందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం కోసం నిధులు కేటాయింపు దక్కుతుందనే ఆశాభావాన్ని జిల్లా వాసులు వ్యక్తం చేస్తున్నారు

సూపర్‌సిక్స్ అమలు కోసం అయ్యే వ్యయం

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకున్న సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం జిల్లాలో ఎంత ఖర్చు కాగలదో గణాంకాలతో సహా నివేదిక పంపాలనే ఆదేశాలు గతంలోనే అధికారులకు అందాయి. వీటికి సంబంధించి పథకాల వారీగా అర్హులు అయ్యేది ఎంతమంది, ఎంత ఖర్చు కాగలదు అనే సవివర నివేదిక ప్రభుత్వానికి యంత్రాంగం అందించింది. దీని ఆధారంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు నిధుల కేటాయింపు జరగనుందని తెలుస్తోంది

చేతిలో ఫోన్ ఉంది కదా ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతూ ఇతరుల వ్యక్తిత్వం దెబ్బతీసే విధంగా పోస్టులు పెడితే ఇకపై వాటికి బాధ్యత వహించి సమాధానం చెప్పాల్సిందే. చట్టం కల్పించిన హక్కును ఉపయోగించుకుని హుందాగా, గౌరవంగా ఎలాంటి అంశం మీద అయినా అభిప్రాయం వెల్లడించడం వరకు ఓకే కానీ నన్నెవరూ గుర్తించరు కదా అనే ధైర్యంతో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌పై ఇతరులను బూతులు తిట్టడమో లేక వారి వ్యక్తిత్వహననానికి పాల్పడడమో చేస్తే మాత్రం చట్టం నుంచి తప్పించుకోలేని విధంగా డేగకళ్లతో పోలీసు నిఘా వ్యవస్థ పనిచేయనుంది.

- సామాజిక మాధ్యమాల్లో వాడే భాష పట్ల జాగ్రత్త
- హుందాగా అభిప్రాయ వ్యక్తీకరణ ఉంటే ఓకే
- వ్యక్తిత్వ హననానికి పాల్పడితే తాఖీదులు తప్పవు
- మార్టూరులో ఓ వ్యక్తి ఫోన్‌నెంబర్‌తో అభ్యంతరకరపోస్టు
- చినగంజాం పోలీస్ స్టేషన్‌లో మరో ఫిర్యాదు
- వెదుక్కుంటూ వైజాగ్ వెళ్లిన మార్టూరు పోలీసులు
- డేగ కళ్లతో పోలీసు నిఘా....స్వేచ్ఛను దుర్వినియోగం చేయొద్దని హితవు

సోషల్‌లో వేషాలేస్తే.. ఊచలే!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
వాట్సాప్ గ్రూపుల్లో కానీ, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాధ్యమం ఏదైనా కానీ అభ్యంతరకర భాష పట్ల పోలీసులకు ఫిర్యాదు అందినా, లేక పోలీసు కళ్లకు అలాంటి పోస్టు చిక్కినా సాంకేతికతను ఉపయోగించి 24 గంటల్లోనే ఆ పోస్టు పెట్టిన వ్యక్తిని చట్టం ముందు నిలబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. సోషల్ మీడియా ఉన్మాద మూకల మీద కఠిన చర్యలు అవలంభించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సదరు సామాజిక మాధ్యమాలలో హద్దు దాటి ప్రవర్తించే వారిపై పోలీస్ శాఖ దృష్టి పెట్టింది. ఇప్పటికే ఈ దిశగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. చట్టం కల్పించిన పరిమితులకు లోబడి భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ ఆ ముసుగులో ఇతరుల పట్ల విద్వేషాన్ని సభ్యసమాజం సిగ్గుపడే రీతిలో వ్యక్తీకరించే వారిపై మాత్రం చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఎస్పీ ఆదేశించారు. ఈ దిశగా ఇప్పటికే అయా సోషల్ మీడియా వేదికలలో హద్దు దాటిన వారిని గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు

సోషల్ మీడియాలో బూతు బాషవాడుతూ పెట్టే పోస్టులను జల్లెడ పట్టే క్రమంలో భాగంగా మార్టూరు పరిధిలో ఓ ఉన్మాద పోస్టు ఖాకీల కంటబడింది. సభ్యసమాజం సిగ్గుపడే రీతిలో ఆ వ్యక్తీకరణ ఉండడం, ప్రభుత్వం ఇలాంటి వాటి మీద సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో వెంటనే విచారణకు పోలీసులు రంగంలోకి దిగారు. విచారణలో భాగంగా మార్టూరుకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ నంబరుతో వైజాగ్‌కు చెందిన ఒకరు ఆ పోస్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకోవడానికి వైజాగ్ వెళ్లిన మార్టూరు పోలీసులకు ఆ పోస్టు పెట్టిన వ్యక్తి ఓ కేసులో అప్పటికే జైలులో ఉండడంతో తిరిగొచ్చారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారాలోకేష్‌లపై అసభ్యకర పోస్టులు పెట్టారని పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడూరు గ్రామానికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజుపై చినగంజాం పోలీస్ స్టేషన్‌లో ఆగ్రామ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదయింది. ఈపురుపాలెం పోలీస్ స్టేషన్‌లో సోషల్ మీడియాలో అభ్యంతర కర పోస్టులపై కేసు నమోదయింది

గత ప్రభుత్వంలో ఫిర్యాదులు బుట్ట దాఖలు

సోషల్ మీడియాలో విశృంఖలత్వం పెచ్చుమీరడానికి గత ప్రభుత్వం అవలంభించిన వైఖరి కూడా కారణంగా నిలిచింది. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై సోషల్ మీడియాలో గళమెత్తిన ఎంతోమందిపై ఉన్మాద మూకలు పరుషపదజాలంతో విరుచుకుపడేవి. వీరిని సదరు నేతలే ప్రోత్సహించడతో తల్లి, చెల్లి తేడా లేకుండా బూతులతో ఎదురుదాడి చేసి వ్యక్తిత్వ హననానికి యధేచ్ఛగా పాల్పడేవారు. ఈ క్రమంలో బాధి తులు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చినా అధికారం అండతో వాటిని బుట్ట దాఖలు చేశారు తప్పితే పట్టించుకున్న పాపాన పోలేదు

బాధితులు బయటికొచ్చే అవకాశం

ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలుగా రెచ్చిపోతున్న ఉన్మాద మూకలపై పోలీసు నిఘా కొనసాగనుంది. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఈ హక్కును దుర్వినయోగం చేసే వారి ఆట కట్టించాలన్న కృత నిశ్చయంతో ఉండడంతో గతంలో బాధితులుగా మిగిలిన ఎంతోమంది ఆ పోస్టుల ఆధారాలతో సహా స్టేషన్ మెట్లెక్కే అవకాశాలు కనబడుతున్నాయి. గడచిన ఐదేళ్ల వ్యవధిలో సోషల్ మీడియాలో అభ్యంతరకర భాష వాడడంతో పాటు ఉద్దేశపూర్వకంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారనే ఫిర్యాదులూ గణనీయంగానే వచ్చాయి. కానీ అప్పటి ప్రభుత్వం బూతు భాషను అధికారికం చేసే విధంగా వ్యవహరించడంతో పోలీసులకు సైతం వాటిపై స్పందించే అవకాశం లేకుండా పోయింది



గతంలో జరిగిన ఘటనలపై...

గతంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వేదికగా ఇతరుల గౌరవానికి భంగం కలిగించిన వారి వివరాలను సేకరించడంతో పాటు ఇంతకు ముందు అభ్యంతరకర పోస్టులపై వచ్చిన ఫిర్యాదులను స్టేషన్ల వారీగా జల్లెడ పట్టే పనిలో పోలీసు శాఖ నిమగ్నమయి ఉంది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఎక్కడా కూడా హుందాగా అభిప్రాయం వెలిబుచ్చే వాళ్లపై గాని, విమర్శ చేసే వాళ్ల యాక్టివిటీస్‌కు ఎలాంటి భంగం వాటిల్లదు. కానీ ఈ ముసుగులో చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించే వారిపై డేగ కళ్లతో పోలీసులు పర్యవేక్షించే విధంగా సదరు శాఖ అప్రమత్తమైంది.

స్వాగతిస్తున్న పౌర సమాజం

సోషల్ మీడియా వేదికలుగా తమను ఎవరు ఏం చేయలేరన్న ధీమాతో హద్దులు దాటి ప్రవరిస్తున్న వికృతమూకలకు కళ్లెం వేసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడాన్ని జిల్లాలోని పౌర సమాజాం స్వాగతిస్తోంది. స్వేచ్ఛ ముసుగులో జరుగుతున్న ఈ వ్యక్తిత్వ హనన క్రీడకు అడ్డుకట్ట వేయాల్సిందేనని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

- వినూత్న వంటకాల తయారీలో ఫుడ్ సైన్స్ కళాశాల
- మార్కెటింగ్ మెలకువల్లోనూ శిక్షణ

రుచీ.. శుచీ నేర్పుతారు

8

తీరం.. జనసంద్రం

- పోటెత్తిన పర్యాటకులు, భక్తులు
- సెలవుదినం కావడంతో పెరిగిన సందర్శకులు
- వాహనాలతో కిక్కిరిసిన పార్కింగ్ ప్రదేశం



కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల నియోజకవర్గానికి గంటా అంజిబాబు, అద్దంకికి అడుసుమల్లి కిషోర్‌బాబు, చీరాలకు ఆమంచి కృష్ణమోహన్, వేమూరు నియోజకవర్గానికి బురగ సుబ్బారావును నియమిస్తూ పీసీసీ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ వేదికగా జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నేతలతో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమావేశమయి భవిష్యత్ కార్యాచరణపై మార్గనిర్దేశనం చేసిన సంగతి తెలి సిందే. ఈ సమావేశంలోనే జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు సమన్వయ కర్తలను నియమించే విషయంలో నేతలతో చర్చించి తుది నిర్ణయానికి వచ్చి ఆదివారం జాబితా విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్‌కు చీరాల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు కూడా అధిష్టానం అప్పగించింది.

దళితులను అణగదొక్కిన జగన్

● మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి



తాడేపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగన్ దళితులకు మేనమామనని చెప్పుకొని దళితులను అణగదొక్కాడని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులతో దళితులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జగన్ ప్రభుత్వంలో దళితులకు ఇచ్చే పథకాలు నిలిపివేశారన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే దళితులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. దళితులను చంపిన వైసీపీ నేతలు అనంతబాబు, నందిగం సురేష్‌కు జగన్ అండగా నిలిచారన్నారు. దళిత డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగితే వేధించి చంపారన్నారు. జగన్ అమలు చేసింది నవరత్నాలు కాదని, నవ మోసాలు అని వ్యాఖ్యానించారు. చదువుకున్న నన్ను గుర్తించి చంద్రబాబు అవకాశం కల్పించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్, పురందరేశ్వరికి ధన్యవాదాలు చెప్పారు.

14న పెదకాకానికి షర్మిల రాక

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెదకాకానిలో ఏర్పాటు చేసిన నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల విగ్రహాల ఆవిష్కరణకు ఈ నెల 14న ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వస్తున్నట్లు గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పెదకాకానిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర మాజీ కేంద్ర మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారు. కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంతేటి యలమందరావు. జొన్నల వెంకటరెడ్డి. కండెల నాగరాజు. షేక్ నాగుల్ మీరా. బొందలపాటి పెద్ద రంగయ్య. బెజ్జం రాజేష్. బట్టు దిలీప్ పాల్గొన్నారు.

దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఈనెల 9న నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల అయ్యాయి. ఈ మేరకు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షకు 201 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 188 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 184 మంది అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు నవంబరు 15తో ముగుస్తాయని తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హులైన వారి జాబితాను దూరవిద్య కేంద్రం వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అలాగే ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చన్నారు.

రేపు వెంకట నరసయ్య స్మారక వ్యాస రచన పోటీలు

పెదకూరపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడుకు చెందిన కవిబ్రహ్మ వేటుకూరి వెంకట నరసయ్య 75వ వర్ధంతి సందర్భంగా పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 12వ తేదీ ఉదయం వ్యాస రచన పోటీలు జరుగుతాయని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజా కవి దర్శి శేషారావు ఆదివారం తెలిపారు. ఈ పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి జాషువాపై ఈ వ్యాస రచన పోటీ జరుగుతుందని, ఆసక్తి గల వారు 8790682858 నంబరులో గాని, ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ 8309754060 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పట్టుదలతో విజయాన్ని సాధించాలి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో విజయాన్ని సాధించాలని రూరల్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం తాడికొండలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో బాగు చేయించిన టీచర్స్ క్వార్టర్స్, ప్రహరీ గోడను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా పాఠశాల గ్రంథాలయాన్ని పరిశీలించారు. పాఠశాల స్థాపించిన దగ్గర నుంచి ప్రస్తుతం వరకు ఉన్న విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యాపకులు కేంద్రమంత్రికి వివరించారు. అంతేకాకుండా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, టీచర్స్ కొరత, జీతభత్యాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితంలో గొప్ప ఆశయాలను కలలు కనాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పూర్వవిద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పాఠశాల, కమ్యూనిటి హాల్, వాకింగ్ ట్రాక్ ఇలా కనీస వసతులు కల్పించే విధంగా 5 ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ మస్తానయ్య, బీజేపీ నాయకులు తాళ్ల శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, సీనియర్ నాయకులు ఎడ్లూరి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, చిగురుపాటి అనూప్, గడ్డిపాటి సాంబశివరావు, ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ నాసరయ్య, ఎంఈవో తెనాలి ఇందిరా, పాఠశాల ప్రిన్సిపాల్ పి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణలో.. అధికారులకు స్వేచ్ఛ

(5పేజీ తరువాయి)

కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. అటవీ సంపద దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా మనం పని చేయాలి. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. రాజకీయ నాయకులు వాళ్ల ముందర కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందన్నారు.

సంజీవని పథకం ద్వారా నిధులు

అటవీ సంపద సంరక్షణలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత దివంగత పందిళ్లపల్లి శ్రీనివాస్‌తో సహా 23 మంది అటవీ సిబ్బంది అమరులయ్యారు. అటవీ అధికారులు గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి శ్రీనివాస్ ప్రాణాలు వదిలారు. వీరి త్యాగాలను మనతో పాటు భావితరాలు మరిచిపోకూడదు. భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు చేస్తాం. నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతాం. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకొచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ. 5 కోట్ల నిధులు సమీకరిస్తాం. అమరవీరుల స్తూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సరస్వతి పవర్ భూముల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపడతాం...

లా అండ్ ఆర్డర్ సమస్యలతోపాటు సరస్వతి పవర్ భూముల్లో 76 ఎకరాలు అసైన్డ్ భూములు, చుక్కల భూములు ఆక్రమించేశారు. దీనితోపాటు వాగులు వంకల సంరక్షణ బాధ్యత కూడా ఉంది. అటవీ శాఖ అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నాము. పవర్ ప్లాంట్ పరిధిలో గ్రీన్ జోన్ ఏర్పాటు చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు కూడా లేవు. సరస్వతి పవర్ వ్యవహారంలో పాల్పడిన ఉల్లంఘనలన్నింటిని పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పవన్ కల్యాణ్ చెప్పారు.

చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరిట ఇష్టానుసారం రోడ్ల పక్కన ఉన్న చెట్లు నరికేశారు. ఈ చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీశాయి. ఈ వ్యవహారంలో బాధ్యులపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాము. చెట్ల నరికివేత మీద చర్యలు మొదలుపెడితే వైసీపీలో ఉన్న చాలా మంది నాయకులు ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెట్ల నరికివేతపై మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీస్ శాఖ స్పందించలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ భార్గవతేజ, నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, జెడ్పీ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు కజురియా, ఎస్.ఎస్. శ్రీధర్, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో అపశ్రుతి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. కాన్వాయ్‌లోని ఓ కారును రోడ్డుపై సిబ్బంది అడ్డంగా నిలిపారు. సరిగ్గా అదే సమయంలో వస్తున్న అంబులెన్స్ కారును చూసి ఆగింది. ఆ సమయంలో అంబులెన్స్‌లో ఉన్న రోగికి ప్రాణపాయ స్థితి ఏర్పడింది. దీంతో పోలీసుల సహకారంతో అంబులెన్స్ సిబ్బంది రోడ్డుపైనే ప్రథమ చికిత్స నిర్వహించారు.

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన అనంతపురం జిల్లా బాలికల జట్టు

సత్తెనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శరభయ్య గుప్తా హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో కొనసాగిన అండర్-19 రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా పని చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో ఉన్న రెండు శాతం రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచి క్రీడాభివృద్ధికి దోహద పడుతున్నారన్నారు. సత్తెనపల్లిలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను విజయవంతం చేసిన నిర్వాహకులను కన్నా అభినందించి సత్కరించారు.

విజేతలు వీరే..

రాష్ట్ర స్థాయిలో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని, విశాఖపట్నం జట్టు ద్వితీయ స్థానాన్ని, కర్నూలు జట్టు తృతీయ స్థానాన్ని, విజయనగరం జిల్లా జట్టు నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని అనంతపురం జట్టు, రెండో స్థానాన్ని వైఎస్ఆర్ కడప జిల్లా, మూడో స్థానాన్ని గుంటూరు జిల్లా, నాలుగో స్థానాన్ని విశాఖపట్నం జిల్లా జట్టు కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే కన్నా బహుమతులను అందించారు. టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, ఆళ్ల అమరేశ్వరరావు, కంభాల వెంకటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, ప్రగతి విద్యా సంస్థల అధినేత మక్కెన అచ్చయ్య, ప్రిన్సిపల్ రాయపాటి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, నిర్వాహకులు పి.శివరామకృష్ణ, ఎస్ సుధాకర్‌రెడ్డి, లాకు పిచ్చయ్య, అనీల్ దత్తా నాయక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక

సత్తెనపల్లి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద మక్కెన జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తలపాల యామిని జాతీయ స్థాయిలో జరిగే అండర్ - 19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అనిల్ దత్తా నాయక్ ఆదివారం తెలిపారు. శరభయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో యామిని జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిందన్నారు. జిల్లా జట్టులో అత్యుత్తమ ప్రతిభ చూపటంతో జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు.

శ్రీకృష్ణ దేవరాయలు ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమే

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



కోటప్పకొండలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు , ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలన దక్షకుడే కాదు, సకల కళా వల్లభుడు, వారు ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమేనని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. కోటప్పకొండలోని కాపు సత్రంలో శ్రీకృష్ణదేవరాయ ట్రస్ట్ 25వ రజిత వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణను ట్రస్ట్ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్నివారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు దేవాలయాల అభివృద్ధిలో చూపించిన కళ ప్రపంచ స్థాయిలో నిలిచిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజా పరిపాలనలో రాజులకే రారాజు శ్రీకృష్ణదేవరాయలు అని అన్నారు. పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోతుల శంకర్, కె.రామకృష్ణ, రాయల శ్రీనివాసరావు, శ్రీశైలం కాపు అన్నదాన సత్రం ఛైర్మన్ ఎం.హనుమంతరావు, తోట సాంబశివరావు, కోవూరి బాబు, మీనా సందీప్, ఢిల్లీ నాయుడు, కాసా ఆంజనేయులు, శ్రీకృష్ణ దేవరాయ ట్రస్ట్ సభ్యులు, రంగిశెట్టి రామకృష్ణ, జనసేన నాయకులు, అల్లంశెట్టి మోహనరావు ఎత్తున పాల్గొన్నారు.

కారంచల్లి కత్తులతో హత్య



హత్యకు గురైన యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొన్నూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేటాడి వెంటాడి కారంచల్లి కత్తులతో పొడిచి హత్య చేసిన సంఘటన పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు, హతుడి బంధువులు కథనం ప్రకారం మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన నక్కల దేవరాజ్ విద్యుత్ మీటర్ల రీడింగ్ తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. దేవరాజు ఆదివారం ములుకుదురు గ్రామం పరిధిలో పంట పొలాల వద్ద హత్యకు గురైనట్లు బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్య జరిగిన తీరు చూసి స్థానికులు హడలిపోతున్నారు. దేవరాజును వేటాడి వెంటాడి కారం చల్లి కత్తులతో పొడిచి చంపినట్లు పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారమే కాపుకాచి విచక్షణా రహితంగా రాడ్లుతో కొట్టి కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్య సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై గండు కిరణ్, సీఐ వై.కోటేశ్వరరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ హత్యకు కుల వివక్షతే కారణం అని మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణం అన్ని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ విడాకులు తీసుకున్న మహిళతో దేవరాజు వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో సదరు యువతి మరోవ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న నేపథ్యంలో ఇరువురి మధ్య వివాదం చలరేగి ఈ హత్యకు దారితీసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి..

దళితులపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని, హతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివారం ములుకుదురులో దళిత సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. దేవరాజు హత్య సమాచారం తెలుసుకున్న నాయకులు పెద్ద ఎత్తున ములుకుదురు గ్రామంలోని జీబీసీ రోడ్డుపైకి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు.

నాటి ఘటనలు కలచివేశాయి

● హస్తకళల అభివృద్ధి చైర్మన్ మంజులారెడ్డి



రెంటచింతల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మే 13న పోలింగ్ రోజున రెంటాల గ్రామంలోని పోలింగ్ బూత్ నంబర్లు 239,240,241,242 వద్ద జరిగిన ఘటనలు కలచివేశాయని, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా వ్యవహరించిన తీరును జీవితాంతం గుర్తుంచుకుంటానని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ చేర్రెడ్డి మంజులరెడ్డి ఉద్వేగంతో అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో తొలిసారి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉదయం 6 గంటల 20 నిమిషాలకు దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న బ్రహ్మానందరెడ్డి హుటాహుటిన తరలివచ్చి తొలుత రెంటచింతలకు అక్కడ నుంచి గురజాల ఆసుపత్రికి మమ్మలందర్ని తరలించారన్నారు. నియోజకవర్గంలోని 74 గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్‌ను పక్కనపెట్టి, మా వద్ద గంటల కొద్ది వేచి ఉండి ధైర్యాన్ని నూరిపోసి అప్పటికప్పుడు చంద్రబాబుకు పరిస్థితిని వివరించారన్నారు. అప్పటి అధికార పార్టీ నేతలకు పోలీసుల అండదండలు పుష్కలంగా ఉండడం వలన టీడీపీ నేతలు నిస్సహాయులుగా ఉండిపోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం వలన దెబ్బలు తిన్న వారందరూ బాధితులుగానే మిగిలిపోయామని, వైసీపీ అధికారంలోకి వచ్చినట్లయితే మా అందర్ని ముద్దాయిలుగా పెట్టి కటకటాల పాలు చేసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ గెలుపే ధ్యేయంగా భావించిన బ్రహ్మానందరెడ్డి పార్టీ శ్రేణులను సైనికులుగా పేర్కొని ఎన్నికల కదనరంగంలోకి దిగి విజయతీరాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీలు శివయ్య, రాజ్‌కుమార్, వెన్నా కృష్ణారెడ్డి, శౌర్రెడ్డి, బోడపాటి రామకృష్ణ, నాళం పెదబాబు, రెంటాల అంజి, సన్నెగంటి సిద్ధయ్య, లింగా పున్నారావు, పోట్ల సతీష్, ఎం.శ్రీను,పాలువాయిగేట్ నరేంద్ర, అల్లం బ్రహ్మారెడ్డి తదితరులున్నారు.

దాతలు సహకరిస్తే.. ఊపిరి నిలుస్తుంది



సర్వేంటిలేటర్‌పై ఉన్న చేజర్ల శంకర్

నరసరావుపేట టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతురులో నివాసం ఉంటున్న చేజర్ల శంకర్ మైలాటిస్ అనే వ్యాధితో బాధపడుతూ 18 ఏళ్లుగా మంచానికే పరిమితమై బతుకు పోరాటం చేస్తున్నారు. ఆయన జీవించి ఉండాలంటే సర్వేంటిలేటర్ అవసరం. ఆ యంత్రం ఆడితేనే అతని శ్వాస ఆడతుంది. దాతలు ఇచ్చిన సర్వేంటిలేటర్‌తో ఆయన భార్య కవిత సేవలతో ఇప్పటి వరకు జీవనం సాగించారు. అయితే సర్వేంటిలేటర్ నిర్వహణ వారికి తలకుమించిన భారం అయింది. ఆ యంత్రంలోని ట్రైకాస్టమి ట్యూబ్, కేతట్రామౌంట్, బాక్టిరియల్ వైరల్ ఫిల్టర్, సక్షన్ ట్యూబ్, వెంటిలేటర్ ట్యూబ్, యూరిన్ కేతట్రా, గ్లౌజ్ బాక్స్ తదితర వస్తువుల నిర్వహణకు నెలకు రూ.11 వేలు ఖర్చు అవుతుందని శంకర్ తెలిపారు. దీనికితోడు ప్రభుత్వం టిడ్కో గృహాల్లో కేటాయించిన ఇంటికి లోను కట్టాలని బ్యాంక్ మేనేజర్ ఫోను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 18లోపు కట్టకపోతే బ్లాక్ లిస్ట్‌లో పెడతామని చెప్పారన్నారు. ప్రభుత్వం పింఛన్‌గా రూ.10 వేలు ఇస్తుందని తెలిపారు. గతంలో ఆర్ఎంపీగా పనిచేసి జీవనం సాగించిన చేజర్ల శంకర్ కుటుంబానికి ఎలాంటి ఆదాయం లేకపోవడం ఇబ్బందిగా పరిణమించింది. పూర్తిగా మంచంపై ఉన్నవారికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదుకుంటారని ఆశతో ఎదురు చూస్తున్నానని అన్నారు. తన భార్య కవితకు మోకాలి శస్త్రచికిత్స జరిగిందని, ఆమె కూడా ఏ పని చేయలేదని వివరించారు. దాతలు సహకరించాలని కోరారు. సహాయం చేయాలనుకున్న దాతలు 7981262549 నంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు



బేస్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలు రెండో రోజు ముగిశాయి. బాలురు, బాలిక విభాగాల్లో ఆదివారం జరిగిన పోటీలను అబ్జర్వర్ శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాధరరావు ఫలితాలను వివరించారు. బాలుర విభాగంలో.. గుంటూరు, విజయనగరం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో విజయనగరం జట్టు 05-06 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 06-01 పాయింట్ల తేడాతో, కర్నూలు, విశాఖపట్నం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు 04-02 పాయింట్లతో, కడప, శ్రీకాకుళం జిల్లాల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం 05-04 పాయింట్లతో గెలుపొందాయి. బాలికల విభాగంలో.. ప్రకాశం, అనంతపురం జిల్లాల మధ్య జరిగిన పోటీలో ప్రకాశం 10-00 పాయింట్లతో గెలుపొందింది. కడప, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు జట్టు 0-5 పాయింట్లతో, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో శ్రీకాకుళం జట్టు 06-00 పాయింట్లతో, కర్నూలు, విజయనగరం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు 03-01 పాయింట్లతో గెలుపొందింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ చౌదరి బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 38 మంది జూదరుల అరెస్టు ● రూ. 93,600 నగదు స్వాధీనం

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న భారీ పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం మెరుపుదాడి చేశారు. చినకోండ్రుపాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన కిట్స్ కళాశాలకు వెళ్లే దారిలో ఒక రేకుల షెడ్డుతో పాటు చుట్టూ ప్రహరీ ఉన్న బహిరంగ ప్రదేశంలో కొంతకాలంగా పేకాట స్థావరం నడుస్తుంది. ఇక్కడికి ప్రత్తిపాడుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లు వచ్చి లక్షల్లో పందేలు కాస్తూ కోతముక్క ఆడుతున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. సుమారు యాభై మంది వరకు పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. పోలీసులు దాడులు చేసిన సమయంలో కొంతమంది పారి పోయారు. ఈ దాడుల్లో వారి వద్ద ఉన్న రూ. 93,600 నగదును స్వాధీనం చేసుకుని 38 మందిని అరెస్టు చేశారు.

క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలి



బాలికల క్రీడాకారుల జట్లతో వేగేశన రాధాకృష్ణరాజు

పిట్టలవానిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు మరింత శిక్షణ ఇవ్వాలని పిట్టలవానిపాలెం మండల కేర్ విద్యా సంస్థల అధినేత వేగేశన రాధాకృష్ణరాజు అన్నారు. ఆదివారం పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాలల విద్యాశాఖ సౌజన్యంతో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల, బాలికల కబడ్డీ పోటీలు 2024-2025 సంవత్సరానికి సంబంధించి బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్.కరీముల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు ముఖ్యఅతిధిగా ఆయన పాల్గొన్నారు. తొలుత క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. 13 జిల్లాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ప్రశాంత్ బాబు పర్యవేక్షించారు. వేగేశన కిషోర్‌రాజు, మాజీ ఎంపీపీ కంకిపాటి యశోధ నరసింహమూర్తిరాజు, ఆయా జిల్లాలకు చెందిన కోచ్‌లు, క్రీడాభిమానులు, పాఠశాల హెచ్ఎమ్ షేక్.మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

మహర్షి ఆశ్రమ గోశాలలో కార్తీక వనసమారాధన

బాపట్ల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహర్షి ఆశ్రమ గోశాలలో ఆదివారం కార్తీక వనసమారాధన జరిగింది. సర్వ దేవతస్వరూప క్షేత్రపాలక హోమం, నవనాగసహిత మానసాదేవికి విశిష్ట పూజలు, అనంతరం సాంప్రదాయ సిద్ధ మహాప్రసాదం, వనసమారాధనగా 100 గోశాలలో సేవ చేసుకున్న గోసేవకులతో మహా అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బి.బాబునాగేంద్ర, బి.ఎస్.నారాయణభట్టు, విజయవాడ యోగా మూర్తి, ఊసా రాంబాబు, మలిశెట్టి భ్రమరాంబ, రామతులసీ, శ్రీనివాస రెడ్డి, వెలగా ప్రసన్నదేవి, బుర్ల శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, హరినారాయణ, లక్ష్మి, శ్రీలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కొమ్మినేని ఉషా, సరిత పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి ఆదివారం సందర్భంగా భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారని తెలిపారు.



శ్రీబగళాముఖి అమ్మవారు

సీపీఎం జిల్లా ప్రథమ మహాసభల లోగో ఆవిష్కరణ

బాపట్ల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన లోగోను ఆదివారం పట్టణంలో ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగయ్య మాట్లాడుతూ ఈనెల 30, డిసెంబరు 1వ తేదీలలో పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో మహాసభలు జరుగుతాయన్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యమాన్ని సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాల రూపుపొందించటం కోసం ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ విధానాలపై సీపీఎం రాజీలేని పోరాటం నడుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, సీహెచ్ మజుందార్, పి.కొండయ్య, శరత్, నాగేశ్వరరావు, టి.సుబాషిణి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బాపట్లరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో ఓ వ్యక్తి అసభ్యకరమైన పోస్టులు పెట్టటంతో వెదుళ్ళపల్లి పోలీసులు అతనిపై ఆదివారం కేసు నమోదు చేశారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ పి.జనార్దనరావు తెలిపిన వివరాలు ప్రకారం... స్టూవర్టుపురంకు చెందిన సీనియర్ నాయకుడు దాసరి జాన్ తన ఫేస్‌బుక్‌ను చూస్తుండగా కోనసీమ జిల్లాకు చెందిన ఆళ్ళ జగదీష్‌రెడ్డి తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్‌ల మీద అసభ్యకరమైన పోస్టును పెట్టాడు. దీంతో ఆళ్ళ జగదీష్‌రెడ్డిపై దాసరి జాన్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగిందని ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

● సీఐ మల్లికార్జునరావు



రేపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని పట్టణ సీఐ మల్లికార్జునరావు అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఫటా ఫట్

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?

సీఐ: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

రౌడీషీటర్ల కదలికలు ఉన్నాయా?

సీఐ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఇటీవలే డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చాం. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం.

గతంలో దుకాణాల్లో చోరీలు జరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఏం చర్యలు చేపట్టారు?

సీఐ : పట్టణంలో చిన్నచిన్న దుకాణాల్లో నేనురాకముందు దొంగతనాలు జరిగిన మాట వాస్తవమే. వాటిని అరికట్టేందుకు రాత్రి సమయంలో ఒకటి నుంచి మూడు గంటల వరకు పెట్రోలింగ్, వాహనాల తనిఖీ చేయడం జరుగుతుంది.

గంజాయి విక్రేతలపై చర్యలు చేపట్టారా?

సీఐ: గతంలో పట్టణంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశాం. ప్రస్తుతం గంజాయి విక్రయించే వారిపై నిఘా ఉంచాం. గంజాయి విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటున్నారా?

సీఐ: పట్టణం, గ్రామాల్లో పేకాట, కోడిపందేలు, నెంబర్ల ఆట వంటి జూద క్రీడలు, బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఎక్కడికక్కడ తమ సిబ్బందిని ఏర్పాటు చేసి అనుమానం ఉన్న వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేశాం.



బాపట్ల గడియార స్తంభంసెంటర్‌లో ఎదురెదురు వచ్చిన వాహనాలతో గందరగోళంగా ట్రాఫిక్



గడియారస్తంభం దగ్గర జీబీసీ రోడ్డుపై తట్టలు పెట్టి పూలు, కాయలు అమ్ముతున్న చిరువ్యాపారులు

పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

● గడియారస్తంభం సెంటర్‌లో నిత్యం ఇబ్బందులు

● పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు, వాహనదారులు

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా కేంద్రంలో నానాటికి ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నది. ప్రధాన రహదార్లు పెద్ద ఎత్తున విస్తరించినా, వన్‌వేరోడ్డు ఏర్పాటు చేసినా వాహనచోదకులకు, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పటం లేదు. నాలుగురోడ్ల కూడలి గడియారస్తంభంసెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ఇక్కడ ఎటు నుంచి వాహనాలు ఎటువెళుతున్నాయో తెలియని విధంగా గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. గడియారస్తంభం దగ్గర ఓవైపు రోడ్డుపై పూలదుకాణాలు, మరోవైపు తోపుడు బండ్లపై పండ్ల వ్యాపారాలు విస్తారంగా ఉన్నాయి. రథంబజారులో రోడ్డుకు ఇరువైపుల దుకాణాల ఎదురు వాహనాల పార్కింగ్, సూర్యలంకరోడ్డులో కూడా ఇదే పరిస్థితి. పర్యాటక కేంద్రానికి వచ్చిపోయే పర్యాటకులను గతంలో వేర్వేరు రోడ్లమీదగా అటుచీరాలవైపు వెళ్ళేవి ఇటు గుంటూరురోడ్డు వైపు వెళ్ళేవి మళ్ళించేవారు. ప్రస్తుతం పోలీసు అధికారులు దీనిపై దృష్టిసారించకపోవటంతో వాహనాలు మొత్తం గడియారస్తంభం దగ్గరకు వచ్చి నిలిచిపోతున్నాయి. అటు చీరాలవైపు వాహనాలు, ఇటు గుంటూరు వైపు వాహనాలు, రథం బజారు నుంచి వచ్చే వాహనాలు, సూర్యలంక నుంచి వచ్చే వాహనాలు మొత్తం గడియారస్తంభం దగ్గర నిలిచిపోయి గందరగోళ పరిస్థితి ఏర్పడుతున్నది. జీబీసీ రోడ్డులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ పక్క నుంచి వన్‌వే రోడ్డు రైల్వేస్టేషన్‌మీదగా పాతబస్టాండ్‌కు వస్తుంది. అయితే ఈరోడ్డుపై వాహనాలు వెళ్ళాల్సి ఉండగా అక్కడ ట్రాఫిక్ పోలీసులు లేకపోవటం వల్ల వాహనాలు మొత్తం నేరుగా గడియార స్తంభం మీదగా పాతబస్టాండ్ వెళుతున్నాయి. ఈసమయంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది.

భావన్నారాయణస్వామి గుడి దగ్గర నుంచి మహాత్మాగాంధీరోడ్డు మీదగా పాతబస్టాండ్‌కు వాహనాలు వెళ్ళే అవకాశం ఉంది. అయితే ఈరోడ్డుపై నిత్యం వ్యాపార సంస్థల ఎదురుగా లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నిలపటం వల్ల వాహనచోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బంది పడుతున్నారు. వీటిపై పట్టణ పోలీసులు దృష్టిసారించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రయాణికులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. కార్తీకమాసంలో సూర్యలంక తీరానికి వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి కావున ఆయా ప్రాంతాలకు వెళ్ళే వాహనాలకు రూట్ మార్చి పంపించే విధంగా చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉంది.

గడియారస్తంభం సెంటర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి



పట్టణంలోని గడియారస్తంభం కూడలి వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి. ట్రాఫిక్ నియంత్రించకపోవటం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగువైపుల నుంచి వాహనాలు రావటం వల్ల గమనించటం కష్టంగా ఉంటుంది. ఎవరు ఎటునుంచి వస్తున్నారో పరిశీలించటం దుర్లభమౌతుంది. కొందరు వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. గడియారస్తంభంసెంటర్‌లో సిగ్నల్‌లైట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి. **- డాక్టర్ పీసీ సాయిబాబు, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి**

వేమూరులో హైందవ శంఖారావం సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్ఎస్ఎస్ ప్రచారక్ జనార్దన్

వేమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు హిందూ దేవాలయ పరిరక్షణ కోసం 2025జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి సంబంధించి ఆదివారం సాయంత్రం వేమూరులో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ నేత కలగా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహ ప్రాంత ఆర్ఎస్ఎస్ ప్రచారక్ జనార్దన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూ ఆలయాల వ్యవస్థను రక్షించుకునేందుకు హిందువులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. హైందవ శంఖారావం ద్వారా ప్రతి హిందువు చైతన్య వంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామం నుంచి హిందువులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇందుకు సంబంధించిన ముందస్తుగా గ్రామాల స్థాయిలో ఏర్పాటు చేయవలసిన సమావేశాలు సన్నాహక నిర్ణయాలు వివరించారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నేత వెంకటప్పరెడ్డి, ఎం.శ్రీనివాసమూర్తి, ఆర్ఎస్ఎస్ నేత శంకరరావు, అర్చక సంఘ నేత వంశీకృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి సగ్గన గణేష్, ఆర్యవైశ్య సంఘ నాయకులు నంబూరు గాంధీ, కలవ వెంకట రాధ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వేమూరు, అమర్తలూరు, కొల్లూరు, చుండూరు మండలాల స్థాయిలో హైందవ శంఖారావ కార్యక్రమ సన్నాహక కమిటీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

పిట్టలవానిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల శాఖ యూటీఎఫ్ నూతన కార్యవర్గ సమావేశం మండలంలోని చందోలు గ్రామంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసమావేశంలో యూటీఎఫ్ మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా కె.ధన్, నూతన మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా మహ్మద్ రహంతుల్లా, సహాధ్యక్షులుగా బర్కతున్నీసా, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ రఫీబుద్దీన్, ఆర్థిక కార్యదర్శిగా మహ్మద్ ఆస్రఫ్ వలి, కార్యవర్గ సభ్యులుగా నాగ సుబ్బయ్య, మహ్మద్‌ఖాశీం, మక్బుల్, సుభాని, సయ్యద్ షబనా, షేక్ ఖమర్‌జహాన్ తదితరులను మండల కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవటానికి ఎన్నికల అధికారిగా ఆడిట్ కమిటీ సభ్యులు సయ్యద్ హబీబ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ శాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ సభ్యులు

సహస్ర కలశాభిషేకం జయప్రదం చేయాలి

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శివాలయం వంద సంవత్సరాల ప్రతిష్ఠ మహోత్సవ ప్రారంభ కార్యక్రమం సందర్భంగా సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు ప్రసాద్‌స్వామి తెలిపారు. ఆదివారం ఆలయంలో పండితులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ కార్తీక పౌర్ణమినాడు సహస్ర కలశాభిషేకం సందర్భంగా 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి అత్యంత వైభవంగా పురవీధులలో శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్తలు, భక్తబృందాలు, భజన సమాజాలు, కోలాట బృందాలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 15వ తేది ఉదయ 7గంటలకు ప్రారంభమయ్యే సహస్ర కలశాభిషేకంలో భక్తులు పాల్గొని స్వయంగా కలశాన్ని అభిషేకానికి సమర్పించిన పిదప ప్రసాదంతోపాటు భక్తులకు ఇవ్వబడుతుందన్నారు. భక్తులు ముందుగా కలశాలు అందజేసి రశీదు పొందాలన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పండితులు నెమలికంటి హనుమంతరావు, పంగులూరి కౌండిన్య, అక్కపెద్ది సుబ్రహ్మణ్యం. ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన

రేపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని రాచూరిజమిందారికోటలో రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనసమారాధన నిర్వహించారు. తొలుత సామూహిక సత్యనారాయణస్వామివ్రతాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కాళేపల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ సంఘీయులంతా ఒక తాటిపైకి నిలబడి ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు తడికమళ్ళ బలరామ శ్రీనివాసు, పొన్నూరు మల్లికార్జునరావు, సుగ్గల సుదర్శన్, యెండురు శివరామకృష్ణ, మానేపల్లి వెంకటసాయి, వేముల కోటేశ్వరరావు, గుర్రం సురేష్‌కుమార్, కెమహేష్, ఎస్.శ్రీనివాసరావు, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీవాసవి ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో ఆర్యవైశ్యులు ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, మండపదేవతాహ్వానం, తులసి ధాత్రి పూజ, శ్రీసత్యనారాయణస్వామివ్రతం, అఖండ కర్పూరజ్యోతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దాల శివరంజన్ నాగలక్ష్మి, నందిపాటి రమేష్ భూలక్ష్మి, నీలి రామకృష్ణ, నాగరాజకుమారి దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలలో పాల్గొనగా మలిశెట్టి రాజగోపాలరావు కుటుంబ సభ్యులు కర్పూరహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పబ్బిశెట్టి రంగారావు, యూనియన్ బ్యాంక్‌అసిస్టెంట్ మేనేజర్ మల్లేశ్వరరావు, కొమ్మూరు మురళి, తూనుగుంట్ల జగన్, పివి.ప్రసాద్, గుప్తా, తూనుగుంట్ల లలితబాబు, భూమా వాసు, వాసవి క్లబ్ అధ్యక్షుడు రాంబాబు, తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పంచమండపాల పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి మధునంబోద్రి

రేపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి పంచమండపాల పడిపూజ మధునంబోద్రి గురుస్వామి వైభవంగా నిర్వహించారు. గుర్రం బుజ్జిబాబు గురుస్వామి 18వ పడిపూజ సందర్భంగా 8వ వార్డులో అయ్యప్పస్వామి పంచమండపాల పూజ వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల వేషధారణతో స్వాములను భజన సంకీర్తనలతో ఉర్రూతలూగించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కోదాడ భాస్కరస్వామి ఆధ్వర్యంలో భజనగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గుర్రంమురహరి గురుస్వామి, గుర్రం దివ్యమణికంఠ, సాంబశివరావు, తాతా ఏడుకొండలు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం : అమిరినేని

రేపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని పేదప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించటం అభినందనీయమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరినేని సత్యనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని గడ్డిపాటి కల్యాణమండపంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ క్యాపిటల్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం చేసుకోలేని పేదప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ఈవైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 150మంది రోగులకు షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు డాక్టర్ జే.పూర్ణచంద్రరావు, డాక్టర్ కవితప్రియాంక నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వైశివప్రసాద్, డీటీ నాయుడు, సుధాకర్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు చీరలు, రగ్గులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 350 మంది వరద బాధితులకు చీరలు, లుంగీలు, రగ్గులు, బెడ్‌షీట్లను ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని పెదలంక పంచాయతీ పరిధిలోని మధ్యగూడెం, మాలపల్లి, రజక కాలనీల్లో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మద్దిబాబు రాజేంద్రప్రసాద్, కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు చిలక అగస్టస్‌బాబు, సర్పంచ్ వేములపల్లి వీరాంజనేయులు, న్యాయవాది దారం సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శులు దర్శి భాస్కరరావు, చిలకా సుధాకర్, గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు కుంభా వీరాంజనేయులు, వంగూరి అశోక్‌కుమార్, పచ్చిగల శేఖర్, బుర్రి సత్యనారాయణ, డి.అశోక్‌కుమార్, వేములపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డెల్టా తూర్పు ప్రధాన కాల్వకు పూర్తి స్థాయి నీటి విడుదల

● పంట పొలాల్లోకి నీరు చేరుతుందని రైతుల ఆందోళన ● నీటిపారుదల శాఖ నిర్లక్ష్యంపై అన్నదాతల ఆగ్రహం



కాల్వలో పూర్తి స్థాయి నీటిమట్టంలో ప్రవహిస్తున్న నీరు

అమృతలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ పంట కోతకు వచ్చే సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో రైతులు తమ పంట కోత కోసేందుకు సమాయత్తం అవుతున్నారు. పంట కోత కోసే సమయంలో తమ పొలాల్లోని నీటిని బయటకు పంపి చేలను పొగి చేసుకున్నారు. కొంత మంది రైతులు తమ పొలాల్లో నీటిని బయటకు పంపేందుకు పంట పొలంలో వర కాల్వలు చేసుకునే ఎత్తుపల్లాలో ఉన్న నీటిని సైతం బయటకు పంపే విధంగా తమ పొలాలను సిద్ధం చేసుకున్నారు. అయితే ఆదివారం కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు ప్రధాన కాల్వకు పూర్తి స్థాయిలో నీటి మట్టం విడుదల చేశారు. దీంతో కాల్వలో నీటి మట్టం తురుమెళ్ళ వద్ద 130 పాయింట్లుకు చేరింది. కాల్వలకు కూడా పూర్తి స్థాయిలో నీరు రావడంతో తమ పొలాల్లో నీరు చేరుతుందని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్త పరుస్తున్నారు. కోత కోసుకునేందుకు సిద్ధం చేసుకున్న పొలాల్లో నీరు పడటంతో తమ కోతలు ఆలస్యం అవుతాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. ఒక పక్క అల్పపీడనం ఏర్పడుతుందని చెదురుమదురు వర్షాలు పడాయని వాతావరణ శాఖ చెబుతున్నా కాల్వలకు ఇలా నీటి విడుదల చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలా నీటిని విడుదల చేయడం వలన తమ కోతలు ఆలస్యమై ముదురు నాటు, లేత నాటు వేసిన పొలాలు ఒకేసారి కోతకు వస్తాయని, దీంతో కూలీల సమస్య ఎదురవడంతోపాటు కూలీ రేటు కూడా విపరీతంగా పెరిగి తమపై ఆర్థిక బారం పడుతుందని రైతులు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో రైతుల అవసరాలు తెలుసుకోకుండా నీటి విడుదల చేయడం ఏమిటి అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై రైతులు ఉన్నతాధికారులను ప్రశ్నించడంతో తమకు చెప్పకుండా సీతానగరం నుంచి అధిక మొత్తంలో నీటిని విడుదల చేశారని ఇందువల్ల కాల్వలకు నీటి పరిమాణం పెంచాల్సి వచ్చిందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో నీటి పారుదల శాఖ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని రైతులు తమ అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. అధికారులు స్పందించి కాల్వలో నీటి పరిమాణం తగ్గించాలని రైతులు కోరుచున్నారు.



బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లను సన్మానిస్తున్న పార్టీశ్రేణులు

'సలగల'కు ఎంపీ తెన్నేటి శుభాకాంక్షలు

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబును ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అభినందించారు. విద్యానగర్‌లోని సలగల నివాసం వద్ద ఆదివారం ఎంపీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడకు తరలివచ్చి సలగల, ఎంపీ కృష్ణప్రసాద్‌లను ఘనంగా సత్కరించి సన్మానించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ రాజేష్, కర్నేటి ఏడుకొండలు, భీమా లీలాకృష్ణ, గవిని దుర్గాప్రసాద్, నక్కా ప్రకాష్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు పమిడి భాస్కరరావు, తోట నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, బోగిరి రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎలిజిబెత్ బ్యారీ స్కూల్ విద్యార్థులతో భేటి అయ్యారు. జీవిత సత్యాలు, చదువు ప్రాముఖ్యతను ఎంపీ కృష్ణప్రసాద్ విద్యార్థులకు వివరించారు.

'సలగల'కు కూటమి నాయకుల సన్మానాలు



సలగల రాజశేఖర్‌బాబును సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు

బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబును కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో కలిసి సత్కరించి సన్మానించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ పార్టీ శ్రేణులతో కలిసి ఆయనను సన్మానించారు. అదేవిధంగా జనసేన నాయకులు నామన వెంకటశివన్నారాయణ, గుంటుపల్లి తులసీకుమారి తదితరులు ఆయనను సన్మానించారు. సలగల అనుచరులు పాతబస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి బాణా సంచా కాల్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త గుంద్రెడ్డి శివ, మాజీ కౌన్సిలర్ వేమవరపు విజయ్‌కుమార్, కూచిపూడి శ్యామ్ సుందర్, బడుగు నాగేశ్వరరావు, ఆడే వంశీ, ఐనంపూడి షాలెంరాజు, పసుమర్తి యలమంద, దారా అశోక్, కనమాల నాగరాజు, పసుమర్తి యోనా, వెంకట్రావు, మార్పు ఆనంద్, రాజేంద్ర, స్వామిరెడ్డి, బోయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ తెన్నేటికి కృతజ్ఞతలు తెలిపిన సజ్జా హేమలత

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివేకానందకాలనీలో ఆదివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా నియమితులైన సజ్జా హేమలత మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావటంపై కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎంపీతోపాటు సజ్జాహేమలతను పార్టీశ్రేణులు ఘనంగా సత్కరించారు.



ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, హ్యాండ్లూమ్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సజ్జా హేమలతను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

మున్సిపల్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

● నెమరవేసుకున్న నాటి మధురస్మృతులు

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో జరిగింది. 1974వ సంవత్సరం ఇక్కడ 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులంతా కలిసి ఒకేవేదికపైకి వచ్చారు. సమావేశానికి పూర్వవిద్యార్థి రోహిణి మహేష్ అధ్యక్షత వహించగా అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆధ్యాత్మికంగా మానవుడు ఎక్కడ నుంచి ఎక్కడికి వెళతాడు అనేది వివరణాత్మకంగా వివరిస్తూ పూర్వవిద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ మాట్లాడుతూ పూర్వవిద్యార్థులకు, ప్రస్తుత విద్యార్థులకు ఎంతో తేడా ఉందని చెప్పారు. అనంతరం పూర్వవిద్యార్థులంతా కలిసి నాడు చదువులు చెప్పిన గురువు చలమయ్య మాస్టర్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. పూర్వవిద్యార్థులు 50 సంవత్సరాల నాటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఆనాటి అటెండర్ చిన్నిబోయన సుబ్బారావు, ప్రస్తుత పీడీ కత్తి శ్రీనివాసరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జూలకంటి ప్రసాద్, ఎస్‌బిఎస్‌జి తిలక్, పాంచజన్య, తిమ్మరాజు వెంకటసుబ్బారావు, బి.వేణుగోపాల్, యాకా హనుమంతరావు, నాగవరపు నాగేశ్వరరావు, రషీద్, హరిప్రకాష్, చలమయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



చదువులు నేర్పిన గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాడి రైతుల అభ్యున్నతికి సంగం కృషి : శివప్రసాద్



పాల సేకరణ నూతన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు ఆర్థికంగా బలపడేందుకు సంగం డెయిరీ కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం చిన్నఅరవపల్లి గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన సంగం డెయిరీ పాలసేకరణ భవనాన్ని సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల కోసం సంగం డెయిరీ బోనస్‌లు, ఉచిత వైద్యాన్ని ఏర్పాటు చేసి ఆదుకుంటున్నారన్నారు. సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతులకు సంగం డెయిరీ ద్వారా దాణా, బోనస్‌లు, ఎక్కువ పాలు పోసే వారికి ప్రోత్సాహ బహుమతులను అందిస్తూ వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రాసుబ్బయ్య, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, బొందలపాటి మల్లికార్జున్‌రావు, భూపతి ఆంజనేయులు, జనసేన పార్టీ నాయకులు మహేష్, దేవగిరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రుచీ.. శుచీ నేర్పుతారు

ఆహార పదార్థాలను రుచిగా శుచిగా ఎలా వండాలి. అంతే కాదు పదార్థాలల్లోని విలువలు పోకుండా ఎలా వండాలి. అంతేనా వాటిని మార్కెటింగ్ ఎలా చేయాలి.. ఆదాయ వనరుగా ఎలా మలచుకోవాలి.. వంటి అంశాలను నేటి తరానికి నేర్పిస్తూ వారిని తీర్చిదిద్దుతోంది బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ. యువతను వ్యాపార వేత్తలుగా తీర్చి దిద్దే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. అతి తక్కువ పెట్టుబడితో రుచికరమైన ఆహార పదార్థాలను శుచిగా జనాలకు అందించడం ఎలాగో నేర్పుతుంది. ఈ రోజుల్లో జనాలు ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యం తెలియని కాదు. అందుకే ఇక్కడ ఆరోగ్య కరమైన ఆహారాన్ని తయారు చేసే విధానంలో కూడా ఈ కళాశాల తర్ఫీదునిస్తోంది. అలాంటి వినూత్నమైన కళాశాల ద్వారా వెలుగులోకి వస్తున్న అభినవ నలభీములపై ఓ లుక్కేద్దామా...

కళాశాల అంతా ఘుమఘుమలే....

నాలుగో సంవత్సరం చదువుచున్న ఫుడ్ సైన్సు విద్యార్థులు రకరకాల వంటకాల తయారీలో ఉండడంతో కళాశాల మొత్తం ఆ వాసనలతో ఘుమఘుమలాడుతూ ఉంటోంది. తరగతి గదులన్నీ వంటిల్లులాగా మారిపోవడం, విద్యార్థులు గుంపులుగా ఏర్పడి గరిట తిప్పుతున్న దృశ్యాలు ఆ కళాశాలలో సర్వ సాధారణం. మొత్తం 250 మంది విద్యార్థులకు గాను అమ్మాయిలు 200 వరకు ఉండగా, అబ్బాయిల సంఖ్య 50 వరకు ఉంటుంది

రుచి, శుచి, ఆరోగ్యం....

ఫుడ్ సైన్స్ టెక్నాలజీలో విద్యార్థులకు బోధించేటప్పుడే రుచి, శుచి, ఆరోగ్యంతో పాటు నాణ్యతకు పెద్ద పీట వేసే విధంగా అక్కడ బోధన ఉంటుంది. మొత్తం 6 యూనిట్లుగా విభజించి బోధన జరుగుతుంది. సిరెల్స్, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ స్పైసెస్, మీట్, మిల్క్, మిల్లెట్ యూనిట్లుగా వంటల తయారీ ఉంటుంది. ఒక్కో యూనిట్‌కు పదిమంది విద్యార్థులను కేటాయించి వివిధ రకాల ఆహార తయారీలను నేర్పుతారు


తినుబండారాలలో ఉన్న పోషక విలువలను వినియోగదారులకు వివరిస్తున్న విద్యార్థులు

- వినూత్న వంటకాల తయారీలో ఫుడ్ సైన్స్ కళాశాల
- మార్కెటింగ్ మెలకువల్లోనూ శిక్షణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బాపట్లలో 2003లో ప్రారంభమైంది. ఇది ఫుడ్‌సైన్స్‌లో బీటెక్ కోర్సును నాలుగు సంవత్సరాలకు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలనుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకు ఫుడ్ సైన్స్ కోర్సు అభ్యసించడానికి వస్తారు. మొదటి మూడు సంవత్సరాలు థియరీ తరగతులకు పరిమితమయ్యే బోధన చివరి సంవత్సరంలో మాత్రం ప్రాక్టికల్‌గా వంటలు చేయడం, అమ్మడం వంటి వాటితో గ్రాడ్యుయేషన్ కోర్సును విద్యార్థులు పూర్తి చేస్తారు

ఒక్కో యూనిట్‌కు 25,000 కేటాయించి..


గ్రూపులుగా విద్యార్థులను విభజించిన తర్వాత వారికి యూనిట్‌లను కేటాయిస్తారు. ఒక్కో గ్రూపుకు పెట్టుబడి కింద 25,000 అందించి నాలుగు నెలల వ్యవధి ఇస్తారు. ఆ మొత్తంతో ముడిసరుకును తెచ్చుకోవడం, ఆహార పదార్థాలు తయారు చేయడం, ప్యాకింగ్, అమ్మకం ఈ ప్రక్రియ అంతా కూడా నాణ్యతా ప్రమాణాలకు లోబడి జరగాల్సి ఉంటుంది. చివరి అంకం అమ్మకాలు కూడా విద్యార్థులే చేయాల్సి ఉంటుంది. పెట్టుబడి కింద ఇచ్చిన 25,000ను పెంచి చూపెట్టి మార్కెటింగ్ నైపుణ్యాన్ని కూడా విద్యార్థులు ఈ ప్రాక్టికల్ శిక్షణలో చూపెట్టాల్సి ఉంటుంది

ఆర్గానిక్ ముడిసరుకు....

విద్యార్థులు తమ ఉత్పత్తులకు కావాల్సిన ముడిసరుకునే నేరుగా రైతుల వద్ద నుంచే కొనుగోలు చేస్తారు. ఎక్కువ శాతం సేంద్రీయంపైనే దృష్టి పెడతారు. పచ్చళ్ల తయారీలో ఫ్రూట్స్, కూరగాయలను పచ్చిగా ఉన్నప్పుడు తెచ్చి సహజ పద్ధతిలో వాటిని నిల్వ ఉంచిన తర్వాతనే పచ్చళ్లను పెడతారు. ఈ క్రమంలో ఆ కూరగాయలు పండించడంలో కెమికల్ శాతాన్ని కూడా శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించిన తర్వాతనే ముందుకు వెళతారు


మిల్లెట్స్‌తో తయారు చేసిన తినుబండారాలు


మిల్క్ ప్రాడక్ట్స్ తయారీలో విద్యార్థులు


వంట పనుల్లో బిజీబిజీగా

ఆరు యూనిట్లుగా....

సిరెల్స్ యూనిట్ కింద ఇన్‌స్టెంట్ దోశ మిక్స్, స్నాక్ ఐటెమ్స్ పూతరేకులు, జంతికలు, చెక్కలను విద్యార్థులు తయారు చేస్తారు. వీటికి కావాల్సిన ముడి పద్దార్థాలన్నింటిని కూడా నేరుగా పొలాల నుంచే సేకరించి వంటకాలు తయారు చేస్తారు. ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్స్ కింద ఔషధ గుణాలున్న కాకరకాయ పచ్చడి, మునగాకు పచ్చడితో పాటు ఉల్లి కారం, నిమ్మ, మామిడి, ఉసిరి లాంటివన్నీ కూడా తయారు చేస్తారు. మిల్లెట్స్ కింద రాగి పిండి, తృణధాన్యాలతో తయారు చేసిన లడ్డూలు, మిక్స్‌డ్ పొడి వంటివి పూర్తినాణ్యతతో తయారు చేస్తారు. మీట్ యూనిట్ కింద చికెన్, ఫ్రాన్స్ పచ్చడి పోషక విలువలున్న పీతలతో నిల్వ ఉండే విధంగా పచ్చడిని తయారు చేయడం ఈ ఫుడ్ సైన్స్ విద్యార్థుల ప్రత్యేకత. ఇక స్పైసెస్ కింద పసుపు, కారం వాటి వాటిని ముడిసరుకు తెచ్చి విద్యార్థులే స్వయంగా మర ఆడించి ప్యాక్ చేసి అందుబాటులోకి తెస్తారు. పాల పదార్థాలకు సంబంధించి బాదంమిల్క్, పాలకోవాతో పాటు సబ్జా లస్సీ వంటివాటిని నాణ్యతతో తయారు చేసి మార్కెట్‌లోకి తెచ్చే విధంగా వీరి తయారీ విధానం ఉంటుంది.


విద్యార్థులు తయారు చేసిన వివిధ రాకాల ఆహార ఉత్పత్తులు

బయటకు....ఈ అభినవ నలభీములకు తేడా...

వ్యాపారంలో లాభాలతో పాటు విలువలు అనే నాణ్యత, ఆరోగ్యం మూల సూత్రం ఆధారంగానే వీరి కోర్సు మొత్తం సాగుతోంది. మారిన అభిరుచుల నేపథ్యంలో మార్కెట్‌లో ధరల గురించి ప్రజలు ఆలోచించడం లేదు. నాణ్యతకు పెద్దపీట వేసి ఆరోగ్యానికి హాని చేయని పదార్థాలను రుచిగా అందించగలిగితే విజయం సాధించినట్లే. వీటిని ఆధారంగా చేసుకనే ఈ కళాశాల విద్యారుథలు ఆయా వంటకాల తయారీలో అనుభవం గడించి ఆ రుచుల ఆస్వాదన కోసం మనల్ని సిద్ధం చేస్తున్నారు

విదేశాలలోనూ అధ్యయనం....

బాపట్లలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలనుంచి ప్రతి ఏడాదీ పదుల సంఖ్యలో విద్యార్థులను ఇతర దేశాలతోపాటు భారత్‌లోని ఇతర రాష్ట్రాల ఆహార అలవాట్లు, అక్కడ వంటకాల తయారీలో అవలంభిస్తున్న విధానాల పట్ల అవగాహన కల్పిస్తారు. ఇందుకు అయ్యే ఖర్చును యూనివర్సిటీయే భరిస్తుంది. తొలి మూడేళ్ల కోర్సుల్లో భాగంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, యూపీ, గుజరాత్ తదితర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడ ఆహార తయారీ విధానాలపై అధ్యయనం చేయిస్తారు. చివరి సంవత్సరం విద్యార్థులను మాత్రం తైవాన్, థాయిలాండ్, నెదర్లాండ్ వంటి విదేశాలకు తీసుకెళ్లి అక్కడి వంటకాల తయారీ పరిస్థితులను నేర్చుకునేటట్లు చేస్తారు.

ఈ విద్యార్థులే ఎంటర్ ప్రెన్యూర్‌లుగా....

ఈ కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో బయటికెళ్లే విద్యార్థులకు విస్తృత అవకాశాలు ఉండడంతో పాటు సొంతగా ఎంటర్ ప్రెన్యూర్స్‌గా కూడా మారి మరికొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగేస్తున్నారు. పలు స్టార్ హోటల్స్‌లో క్యాలిటీ చెకప్ విభాగంలో కానీ, లేదంటే ప్రభుత్వం వైపు నుంచి ఆహార నాణ్యతా ప్రమాణాల విభాగంలో కానీ ఉపాధి లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కన్నుల పండువగా మహారుద్రాభిషేకం

❖ వేలాదిగా తరలివచ్చిన భక్తులు

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం సందర్భంగా వినుకొండలో శంఖం, ఢమరుకం, ఘంటానాదం, మంగళ ధ్వనులతో అశేష జనవాహిని మధ్య మహాదేవుని మహా రుద్రాభిషేకం, భస్మాభిషేకం నేత్రపర్వంగా ఆదివారం జరిగింది. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో అమ్మ చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు జ్ఞానప్రసన్న స్వామిజీ తన శిష్యులతో ఈ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలో ఏడు అడుగుల మృత్తికా శివలింగానికి ప్రత్యేకపూజలు చేశారు. శివలింగానికి పసుపు, కుంకుమ, భస్మం, ఫల రసాలు, పలు రకాల పూలు, లక్ష రుద్రాక్షలు, గంధం, సుగంధ ద్రవ్యాలు, జలాలతో మహా రుద్రాభిషేకం కొనసాగింది. అనంతరం శివుడికి హారతి, నైవేద్యం, పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు, హర హర మహా దేవ శంభోశంకర నినాదాలతో జూనియర్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడు తూ జ్ఞాన ప్రసూన స్వామిజీ 30 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు, ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం, అనాధ పిల్లలను చదివించడం వంటి ఎన్నో అమ్మ ఆశ్రమం ద్వారా చేపడుతున్నారని, అందుకు ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. రామలింగేశ్వర స్వామి గుడి అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఈ సందర్భంగానే ఫిరంగిపురం మండలం వేమవరంలో జ్ఞానప్రసన్న స్వామిజీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కోటిలింగాల ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. తన వంతుగా దేవాలయం నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జీవీ ఈ సందర్భంగా ప్రకటించారు.


మృతికా శివలింగానికి అభిషేకాలు చేస్తున్న స్వామీజీలు


మహారుద్రాభిషేకం కార్యక్రమానికి హాజరైన భక్తులు

తీరం.. జనసంద్రం

> ప్రముఖ పర్యాటక కేంద్రం, సూర్యలంక సముద్ర తీరం ఆదివారం పర్యాటకులు, భక్తులతో జనసంద్రంగా మారింది. కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఒక వైపు, ఆదివారం సెలవు దినం కావడంలో విచ్చేసిన పర్యాటకులు మరోవైపు సూర్యలంక సాగర తీరాన్ని అటు ఆధ్యాత్మిక భక్తిభావంతో, ఇటు పర్యాటక కోలాహలంతో ముంచెత్తారు. భక్తులు కార్తీకమాస పుణ్యస్నానాలు ఆచరించి, పూజలు నిర్వహించగా, యువత కేరింతలు కొట్టగా, చిన్నారులు ఇసుక తిన్నెలలో ఆటలాడుతూ మునిగి తేలారు.

- పోటెత్తిన పర్యాటకులు, భక్తులు
- సెలవుదినం కావడంతో పెరిగిన సందర్శకులు
- వాహనాలతో కిక్కిరిసిన పార్కింగ్ ప్రదేశం
- ముమ్మరంగా పోలీసు బందోబస్తు
- సముద్రంలో గజ ఈతగాళ్ల గస్తీ

బాపట్లరూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సాగర తీరాన్ని ఆదివారం భక్తులు, సందర్శకులు ఆక్రమించారు. ఆదర్శనగర్ నుంచి సూర్యలంక తీరం వరకు వాహనాల రాకపోకలు రద్దీగా మారిపోయింది. తీరం ఒడ్డున పార్కింగ్ ప్రదేశం వాహనాలతో కిక్కిరిసిపోయింది. దూర ప్రాంతాలు నుంచి కుటుంబ సమేతంగా పర్యాటకులు సూర్యలంక తీరానికి చేరుకొని తీరంలో పుణ్యస్నానాలను ఆచరించారు. తీరం ఒడ్డున భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తీరం సమీపంలోని శ్రీ తారకేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను చేశారు.

యువకులు, చిన్నారులు తీరం ఒడ్డున ఇసుక తిన్నెలతో ఆడుకుంటూ ఉండగా యువకులు తీరంలో అలలకు కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. సుమారు 30 వేలకు మంది పైగా పర్యాటకులు రావటం జరిగింది. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో బాపట్ల రూరల్ సీఐ కే.గంగాధరరావు ఆధ్వర్యంలో పర్యాటకులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తూ నిర్వహించారు. గజ ఈతగాళ్ళు సముద్రంలో బోట్లపై తిరుగుతూ పర్యాటకుల ప్రాణ రక్షణ కోసం గస్తీని చేపట్టారు. తీరం ఒడ్డున తాత్కాలిక దుస్తులను మార్చుకునే గదులను పంచాయతీవారు ఏర్పాటు చేయగా స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులకు జల్లు స్నానాలను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తీరం ఒడ్డునే ఏర్పాటు చేశారు. సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరించిన అనంతరం ఆదర్శనగర్ సమీపంలోని జీడిమామిడి తోటలు కింద కుటుంబ సమేతంగా కార్తీక వన భోజనాలను చేస్తూ ఆనందంగా గడిపారు.


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు, భక్తులు

డేటా చౌర్యంపై ఉలిక్కి పడిన పోలీస్ శాఖ

- రౌడీషీటర్ బోరుగడ్డ కస్టడీ దృశ్యాలు బహిర్గతంపై సీరియస్
- అరండల్‌పేటస్టేషన్లో టెక్నీషియన్, విలేకరిపై కేసు నమోదు

గుంటూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు సంబంధించి అత్యంత రహస్యంగా ఉంచాల్సిన డేటా చౌర్యం కావడంపై పోలీసు శాఖ ఉలిక్కిపడింది. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ లోని సీసీ కెమెరాకు సంబంధించిన ఫుటేజ్ బయటకు రావడం పై పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. ఎస్ఐ రోజాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్నీషియన్ శేషు, ఓ పత్రికా విలేకరిపై డేటా చౌర్యానికి సంబంధించి కాపీరైట్ యాక్ట్, ఐటి యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసు కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అరండల్ పేట పోలీస్ స్టేషన్ లోనూ, అదేవిధంగా స్టేషన్ పరిధిలోను గతంలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకముందు ప్రైవేట్ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా శేషు అనే వ్యక్తి సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలు గాని, అదేవిధంగా పోలీస్ స్టేషన్ లోని కంప్యూటర్లు గాని ఏదైనా సాంకేతికపరమైన సమస్య ఎదురైతే శేషుతో రిపేర్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సంబంధించిన పాస్వర్డ్ కూడా శేషు వద్దే ఉంటుంది. ఇదిలా ఉంటే ఇటీవల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్యపై ఓ పత్రిక విలేకరి పలు వరుస కథనాలు రాయడంతో పోలీసు అధికారులు సదరు విలేకరిపై దృష్టి పెట్టారు. ఆ విలేకరి గతంలో నగరంలో సిటీ బస్సుకు సంబంధించిన ఇరువురు యజమానుల మధ్య తలెత్తిన వివాదంలో జోక్యం చేసుకొని ఒకరి తరుపున పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించడం, ఈ విషయం ఇరువర్గాల మధ్య వివాదాస్పదమయింది. తాజాగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య పై కథనాలు రాసిన నేపథ్యంలో గతంలో జరిగిన వివాదాన్ని బయటకు తీసి ఇటీవల ఆ విలేకరిపై అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేవలం పోలీసులు కక్ష సాధింపు చర్యలో భాగంగా తనపై తప్పుడు ఎస్సీ ఎస్టీ కేసు బనాయించారని భావించిన సదరు విలేకరి తనకు పరిచయం ఉన్న సీసీ కెమెరా టెక్నీషియన్ శేషు ద్వారా ఇటీవల పోలీస్ కస్టడీలో బోరుగడ్డ అనిల్ ఉన్నప్పుడు స్టేషన్ లో చోటు చేసుకున్న పరిణామాలను సీసీ కెమెరా ఫుటేజ్‌ను బయటికి తీయించాడు. అందులో పోలీస్ స్టేషన్లో అనిల్ కుమార్ బల్లపై నిద్రించిన దృశ్యాలకు సంబంధించిన ఫుటేజ్‌ను బయటకు ఇవ్వడంతో అవి సోషల్ మీడియాలో వైరల్ కాగా, అదేవిధంగా మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రసారమయ్యాయి. బోరుగడ్డ వ్యవహారంలో పోలీస్ శాఖలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రభుత్వం కూడా సీరియస్‌గా ఉండడంతో అరండల్ పేట సీఐ కే శ్రీనివాసరావును విఆర్ కు పంపుతూ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సీసీ కెమెరా ఫుటేజ్ ను బయటకు ఇచ్చిన టెక్నీషియన్ శేషును పోలీసులు శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విలేకరి అడగడంతోనే తాను ఇచ్చినట్లు శేషు అంగికరించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో త్వరలోనే ఆ విలేకరిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉంది.


నాగార్జున సాగర్ కాలువ

నీటితీరువా వసూళ్లలో...
గందరగోళం

సత్తెనపల్లి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోల పర్యవేక్షణలో జరిగే నీటి తీరువా వసూళ్ళను వైసీపి ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం గ్రామ సచివాలయాలకు అప్పగించడంతో అరఎకరం భూమికి ఏడాదికి 100 రూపాయలు చెల్లించే రైతు సర్వీస్ చార్జీ రూపంలో మరో 35 రూపాయలు కలిపి 135 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. చెల్లించడంలో ఆలస్యం అయితే రైతులు కట్టవలసిన నగదుకు 6 శాతం వడ్డీ వేసి సచివాలయంలో వసూళ్లు చేస్తున్నారు. అసైన్డ్ భూములకు నీటితీరువా వసూళ్ళు చేయకపోవడంతో పంట రుణాలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏట జూన్ ప్రారంభం నుంచి మరుసటి ఏడాది జూలై నెల చివరి వరకూ ఏడాది పాటు నీటి తీరువా వసూళ్ళను ఒక పద్ధతిగా చేస్తుంటారు. ప్రస్తుతం 1432వ ఫసలి నడుస్తున్నది. వరి సాగుకు ఏడాదిలో రెండు పంటలకు సాగునీరు విడుదల చేస్తే ఎకరానికి 350 రూపాయలు నీటితీరువాగా వసూళ్ళు చేస్తారు. ఖరీఫ్ పంటకు మాత్రమే సాగునీరు ఇస్తే ఎకరానికి రెండు వందల రూపాయలు వసూలు చేయాల్సి ఉంది. చేపల చెరువులకు ఏడాదికి ఎకరానికి 500 రూపాయలు వసూలు చేస్తారు. ప్రస్తుతం సచివాలయాల ద్వారా వసూళ్లు చేస్తున్న నీటి తీరువాలో పలు ఇబ్బందులున్నాయి. రైతుకు 4ఎకరాల భూమి ఉంటే సాంకేతిక తప్పిదాల కారణంగా 3 ఎకరాలు మాత్రమే అడంగళ్‌లో చూపుతుంది. నీటి తీరువా చెల్లించే సమయంలో ఈ 3 ఎకరాలకే శిస్తు కట్టించుకుంటున్నారు. దీంతో ఎకరం భూమి తన పేరున ఉన్నా ఆన్‌లైన్‌లో కనిపించక పోవడంతో నీటి తీరువా చెల్లించేందుకు రైతులకు అవకాశం లేకుండా పోయింది. గతంలో అసైన్డ్, పోరంబోకు భూములకు కూడా వీఆర్వోలు నీటి తీరువా వసూలు చేసేవారు. రసీదులు కూడా ఇచ్చే వారు. ప్రస్తుతం పట్టా భూములు, అవి కూడా అడంగళ్‌లో నమోదై ఉన్న భూములకు మినహా ఇతర కేటగిరిలో ఉన్న భూములకు నీటి తీరువా వసూళ్ళను రెండేళ్ళుగా నిలిపివేశారు. నీటి తీరువా ప్రతి ఏటా కడితే భూమి తమదేననే ధైర్యం రైతులకు ఉంటుంది. అసైన్డ్, ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న చిన్న పాటి రైతుల నుంచి నీటితీరువా కట్టించుకోక పోవడంతో సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులలో రైతులకు పంట రుణాలివ్వడం లేదు. రైతులు రుణాల కోసం స్థానిక వడ్డీ వ్యాపారులపై ఆధారపడవలసి వస్తుంది. రైతుల ఇబ్బందులను గుర్తించి కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూములకు నీటితీరువా కట్టించుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


పత్తిపంట

క్రీడాకారులతో ఆడుకున్నారు!

జిల్లాలో క్రీడాకారులకు కొదువ లేదు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వివిధ పోటీల్లో రాణించి అనేక మంది మట్టిలో మాణిక్యాల్లా మెరిశారు. పలు పతకాలతో జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రీడారంగం మసకబారింది. క్రీడాకారులకు ప్రోత్సాహం లేకపోవడం, అస్తవ్యస్త విధానాలు, అరకొర నిధుల కేటాయింపు అందుకు కారణమైంది. ఆటలపైనా నాటి ప్రభుత్వం ఫీ'జులుం' ప్రదర్శించింది. 'పే అండ్ ప్లే' విధానాన్ని ప్రవేశపెట్టి క్రీడాకారుల నుంచి రూ.లక్షలు దండుకొంది. ప్రాక్టీస్‌కు అవసరమైన మైదానాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు చతికిలపడ్డారు. ఈనేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో ఆటల అభివృద్ధిపై ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వం మారి నాలుగు నెలలు కావస్తున్నా పే అండ్ ప్లే విధానం కొనసాగుతుండటంపై క్రీడాకారులు, కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- వైసీపీ పాలనలో క్రీడారంగం చతికిల
- ఆటగాళ్లపై ఫీ'జులుం'
- ప్రవేశ, నెలవారీ రుసుం నిర్ణయించి వసూళ్లు
- మైదానాల గురించి పట్టించుకోని వైనం
- గత టీడీపీ హయాంలో నిర్మించిన స్టేడియంలు నిరుపయోగం
- కొన్నిచోట్ల ప్రైవేటు కార్యక్రమాలకు వేదికలుగా మారిన వైనం
- పూర్వ వైభవం కోరుతున్న సంఘాలు
- పే అండ్ ప్లే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి



ఒంగోలు (కార్పొరేషన్), నవంబరు 10 : క్రీడాకారులతో గత వైసీపీ పాలకులు ఆటలాడుకున్నారు. క్రీడల అభివృద్ధిని విస్మరించారు. ఆటలనే ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. 'పే అండ్ ప్లే' విధానాన్ని తీసుకొచ్చి ప్రవేశ, ప్రాక్టీసు ఫీజులు వసూలు చేశారు. కోచ్‌లకు టార్గెట్లు నిర్ణయించి ఆమేరకు క్రీడాకారులను రప్పించాలని హుకుం జారీ చేశారు. ఆటగాళ్ల నుంచి వసూలు చేసిన నిధులకు లెక్కాపత్రం లేదు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించక, అవసరమైన మైదానాలు లేక ఐదేళ్లుగా జిల్లాలో క్రీడారంగం పరాజయం బాటన నడిచింది.

యూజర్ చార్జీల పేరుతో శాప్ వసూళ్ల పర్వం

వైసీపీ అధికారంలోకి రాకముందు వరకు టీడీపీ పాలనలో క్రీడారంగం విజయం వైపు దూసుకెళ్లింది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, నియోజకవర్గాల వారీగా మినీ స్టేడియాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో దాదాపు రూ.2కోట్లకు పైగా ఖర్చు చేసి స్టేడియం నిర్మించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మైదానంలో అడుగు పెట్టాలంటే ఓ రేటు, అడ్మిషన్ పొందాలంటే మరో రేటు, శిక్షణ పొందాలంటే నెల వారీ ఫీజు చెల్లించాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో శాప్ యూజర్ చార్జీలు అంటూ ఇలాంటి అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడంతో క్రీడారంగం ఓటమిపాలైంది.

పోటీలు, పతకాలు కరువు

జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉండే బాల, బాలికలు వారికి సమీపంలో ఉన్న మైదానాల్లో శిక్షణ పొందుతుంటారు. వ్యాయామోపాధ్యాయులు క్రీడలపట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు శిక్షణ అందించి ఎంపిక చేస్తారు. అత్యధికశాతం మంది గ్రామీణ ప్రాంత, పేద, క్రీడాకారులే ఉంటారు. అయితే 2019 సంవత్సరం వరకు వారు పైసా చెల్లించకుండానే అందుబాటులో ఉన్న మైదానాలు, కోచ్‌లు, ఆట పరికరాలతో శిక్షణ పొందిన గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగారు. అయితే ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు వారితో ఇష్టారాజ్యంగా ఆడుకున్నారు. అవసరమైన నిధులు కేటాయించకుండా పోటీల నిర్వహణకు దాతల సహకారంతో నిర్వహించుకోవాలని, క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేయాలని ఉత్వర్వులు జారీ చేశారు. దీంతో నాలుగున్నరేళ్లుగా పోటీలు లేకపోవడంతో పతకాలు కూడా కరువయ్యాయి.

ప్రైవేటు కార్యక్రమాలకు వేదికగా మినీ స్టేడియం

జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ స్టేడియంల నిర్మాణాలు చేపట్టింది. ఒంగోలులో క్రీడామైదానం కోసం ఒంగోలుకు చెందిన పర్వతరెడ్డి ఆనంద్ రూ.1కోటి విరాళంగా ఇవ్వగా, ఆతర్వాత ప్రభుత్వం అదనంగా రూ.కోటికిపైన కేటాయించింది. అయితే షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో శిక్షణకు అవసరమైన చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ప్రస్తుతం అది పేరుకు మాత్రమే అన్నట్లు ఉంది. మైదానంలో పోటీల నిర్వహణకు పలు క్రీడా సంఘాలు విన్నవించుకున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు, చీఫ్ కోచ్‌లు ఫీజులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక నగరపాలక సంస్థ పాఠశాలలకు చెందిన క్రీడామైదానాలలో నిర్వహించుకుంటున్నట్లు పలువురు కోచ్‌లు, వ్యాయామోపాధ్యాయులు వాపోతున్నారు. ఇదిలా ఉంచితే ఈ మైదానం ఇప్పుడు ప్రైవేటు కార్యక్రమాలకు వేదికగా మారింది. అత్యధిక జనాభా పట్టే ఆ మైదానంలో ఒకరోజుకు సుమారు రూ.20వేల నుంచి 25వేలు వసూలు చేస్తుండటంపై క్రీడా సంఘాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.



కోచ్‌లపై అదనపు భారం

క్రీడాప్రాధికార సంస్థకు చెందిన కోచ్‌లు నిత్యం సంబంధిత ఆటల్లో శిక్షణ ఇవ్వాలి. పే అండ్ ప్లే విధానంతో ఫొటోలు అప్‌లోడ్, యాప్‌లలో సాధించిన ప్రగతిని ఉదయం, సాయంత్రం తెలియజేయాల్సి వస్తోంది. దీనికితోడు క్రీడాకారుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేయడంతోపాటు, పాఠశాలలు, కళాశాలలు నగదు చెల్లించి తిరిగి క్రీడాకారుల స్టేడియానికి వచ్చేలా మరో అదనపు పనిభారాన్ని మోపారు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఫీజు చెల్లించలేని విద్యార్థుల ఫీజులను కూడా కోచ్‌లు భరించాల్సిందేనని ఇక్కడి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ఆదేశించడంతో అదనపు భారం మోయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్రీడాభివృద్ధిపై ఆశలు పెంచుకున్నారు. కానీ ఇప్పటి వరకూ పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆ విధానాన్ని తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆటల అభివృద్ధికి తోడ్పాటు అందించడంతోపాటు, మైదానాల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు కోరుతున్నారు.

అటవీ సంరక్షణలో అధికారులకు స్వేచ్ఛ

(5వ పేజీ తరువాయి)

కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. అటవీ సంపద దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా మనం పని చేయాలి. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. రాజకీయ నాయకులు వాళ్ల ముందర కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందన్నారు.

సంజీవని పథకం ద్వారా నిధులు

అటవీ సంపద సంరక్షణలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత దివంగత పందిళ్లపల్లి శ్రీనివాస్‌తో సహా 23 మంది అటవీ సిబ్బంది అమరులయ్యారు. అటవీ అధికారులు గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి శ్రీనివాస్ ప్రాణాలు వదిలారు. వీరి త్యాగాలను మనతో పాటు భావితరాలు మరిచిపోకూడదు. భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు చేస్తాం. నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతాం. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకొచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ. 5 కోట్ల నిధులు సమీకరిస్తాం. అమరవీరుల స్థూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. .

సరస్వతి పవర్ భూముల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపడుతాం

లా అండ్ ఆర్డర్ సమస్యలతోపాటు సరస్వతి పవర్ భూముల్లో 76 ఎకరాలు అసైన్డ్ భూములు, చుక్కల భూములు ఆక్రమించేశారు. దీనితోపాటు వాగులు వంకల సంరక్షణ బాధ్యత కూడా ఉంది. అటవీ శాఖ అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నాము. పవర్ ప్లాంట్ పరిధిలో గ్రీన్ జోన్ ఏర్పాటు చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు కూడా లేవు. సరస్వతి పవర్ వ్యవహారంలో పాల్పడిన ఉల్లంఘనలన్నింటిని పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పవన్ కల్యాణ్ చెప్పారు.

చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరిట ఇష్టానుసారం రోడ్ల పక్కన ఉన్న చెట్లు నరికేశారు. ఈ చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీశాయి. ఈ వ్యవహారంలో బాధ్యులపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాము. చెట్ల నరికివేత మీద చర్యలు మొదలుపెడితే వైసీపీలో ఉన్న చాలా మంది నాయకులు ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెట్ల నరికివేతపై మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీస్ శాఖ స్పందించలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, జేసీ భార్గవతేజ, నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, జెడ్పీ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు కజురియా, ఎస్.ఎస్. శ్రీధర్, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో అపశ్రుతి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. కాన్వాయ్‌లోని ఓ కారును రోడ్డుపై సిబ్బంది అడ్డంగా నిలిపారు. సరిగ్గా అదే సమయంలో వస్తున్న అంబులెన్స్ కారును చూసి ఆగింది. ఆ సమయంలో అంబులెన్స్‌లో ఉన్న రోగికి ప్రాణపాయ స్థితి ఏర్పడింది. దీంతో పోలీసుల సహకారంతో అంబులెన్స్ సిబ్బంది రోడ్డుపైనే ప్రథమ చికిత్స నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలు

అద్దంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న యువకుడుకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెంకు చెందిన కాలువ ఏసోబు ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా నామ్ రోడ్డులో గోవాడ డొంక వద్ద అద్దంకి వైపు నుంచి కొప్పెరపాడు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఏసోబును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. ఏసోబు గోవాడ నుంచి ఏనుగుపాలెం వెళ్లేందుకు నామ్ రోడ్డుపై మలుపు తిరిగే సమయంలో ప్రమాదం జరిగిందా లేక అద్దంకి వైపు నుంచి వెళ్తుంటే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా అన్న విషయం పై స్పష్టత రాలేదు.

హనుమంతరెడ్డిపై కేసు

మేదరమెట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రాన్ని అవమానకరంగా మా ర్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన కడకు చెందిన హను మంతరెడ్డిపై మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. మేదరమెట్లకు చెందిన గోలి అజయ్ హను మంతరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ షేక్ మహ్మద్ రఫి కేసు నమోదు చేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, నవంబరు 10 (ఆం ధ్రజ్యోతి): మండలంలో గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు ని ర్వహించారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా కరుణించమని భక్తులు వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు.

తేలని పంచాయితీ

- పూర్వపు డీపీవో ఇష్టారాజ్య ఫలితం
- పోస్టింగ్‌లు లేక గాలిలో ఉన్న 56 మంది ఉద్యోగులు
- 50 రోజులుగా ఎదురుచూపులు
- పీఆర్ కమిషనర్‌కు కలెక్టర్ లేఖ రాసినా స్పందన కరువు
- సర్వీసు కోల్పోతామని గ్రేడ్-5,-6 సచివాలయ ఉద్యోగుల ఆందోళన



జిల్లా డీపీవో కార్యాలయం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్-5,6 (సచివాలయ) ఉద్యోగుల పోస్టింగ్‌ల విషయంలో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. 50 రోజులుగా పంచాయితీ నడుస్తూనే ఉంది. పూర్వపు డీపీవో, కొందరు ఉద్యోగుల అవినీతి, అక్రమాల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. దీంతో 56 మంది ఉద్యోగులకు ఎక్కడా పోస్టింగ్‌లు లభించక గాలిలోనే ఉండిపోయారు. వారంతా ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాము సర్వీసు కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బదిలీల్లో భారీగా అక్రమాలు

ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అన్నిశాఖల్లో ఆ ప్రక్రియను సాఫీగానే పూర్తి చేశారు. అయితే జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అవినీతి, అక్రమాలు భారీగా చోటుచేసుకోవడంతో గందరగోళం నెలకొంది. బదిలీల ఉత్తర్వులు ఇచ్చేందుకు ఉద్యోగుల నుంచి అప్పటి అధికారి, కొందరు ఉద్యోగులు పెద్దమొత్తంలో వసూలు చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీని నియమించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వర రావు నేతృత్వంలో విచారణ చేపట్టిన కమిటీ అక్రమాలు నిజమేనని తేల్చింది. నివేదికను కలెక్టర్‌కు సమర్పించింది. దాన్ని పరిశీలించిన కలెక్టర్.. ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు 15 రోజుల క్రితం లేఖ రాశారు. దానికి త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను కూడా జతచేసి పంపారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి స్పందన లేదు. విచారణ ముగిసే లోపే ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. అప్పట్లో డీపీవోగా ఉన్న ఉషారాణిపై చర్యలకు కలెక్టర్ సిఫార్సు చేశారు.

కలెక్టర్ ప్రొసీడింగ్స్‌కు భిన్నంగా బదిలీలు

ఉద్యోగుల బదిలీలను కలెక్టర్ అన్సారియా ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు భిన్నంగా చేసినట్లు గుర్తించారు. దీంతో 56 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేక గాలిలో ఉండిపోయారు. వారంతా కలెక్టర్‌తోపాటు ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారిని కలిసి గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం పోస్టింగ్ లేక గాలిలో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు 15 రోజుల క్రితం కలెక్టర్ లేఖ రాశారు. ఇప్పటి వరకూ అక్కడి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గాలిలో ఉన్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని ఉద్యోగుల విజ్ఞప్తి

ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసు అనేది ఎంతో ముఖ్యమైంది. భవిష్యత్‌లో ఉద్యోగోన్నతలు దాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుతం గాలిలో ఉన్న ఉద్యోగులకు 50 రోజుల నుంచి పోస్టింగ్‌లు లేకపోవడంతో భవిష్యత్‌లో ఉద్యోగోన్నతులు కోల్పోతామని వారంతా ఆందోళన చెందుతున్నారు. వీరికి పోస్టింగ్‌లు ఇప్పించే విషయంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు. కలెక్టర్ చొరవచూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

104 ఉద్యోగుల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ 104 ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ 104 ఉద్యోగుల విషయంలో అరబిందో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. వారిని బానిసలుగా చూస్తున్నదని మండిపడ్డారు. కనీస వేతనాలు ఇవ్వకపోగా ప్రభుత్వం అంగీకరించిన స్లాబ్ సిస్టం అమలు చేయలేదని మండిపడ్డారు. ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐలలో యాజమాన్యం వాటా కట్టకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆ సొమ్మును రికవరీ చేసి కార్మికుల ఖాతాలో జమచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే కొత్త ఉద్యోగాలలో 104 సిబ్బందికి వెయిటేజ్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 104 ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి కె.రవివర్మ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ నెలరోజులుగా వివిధ పద్ధతుల్లో ఆందోళనలు చేస్తున్నా అరబిందో యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అబ్బూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో శ్రీధర్‌రెడ్డి, నరేంద్ర, సుబ్బయ్య, శ్రీకాంత్, ఉదయభాస్కర్, వెంకటేశ్వర్లు, శ్వేత, స్వాతి, పావని పాల్గొన్నారు.



రామాపురం డంపింగ్ యార్డులో చెత్త, మధ్య పనిచేయని మిషన్

చె(చి)త్త శుద్ధి శూన్యం

- మూలనపడ్డ యంత్రాలు
- అలంకారప్రాయంగా వర్మీ కంపోస్టు భవనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మూలనపడ్డ కొబ్బరిపీచు తీసే మిషన్

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెత్త శుద్ధిలో పాలకులు, అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదు. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ అలంకార ప్రాయంగా మారింది. చెత్త విభజన, చెత్త నుంచి సంపద తయారీ ప్రక్రియలు మూలనపడ్డాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరటం లేదు.

చీరాల మున్సిపల్ పరిధిలో చెత్త సమస్య తలెత్తకుండా వేటపాలెం మండలం రామాపురం పరిధిలో సుమారు రూ.5 కోట్లు వ్యయంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. చీరాల మున్సిపల్ పరిధిలో వచ్చే చెత్తను ట్రాక్టర్లు, డోజర్లు ద్వారా అక్కడకు తరలిస్తారు. అక్కడ తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి చెత్త నుంచి సంపద సృష్టించేవిధంగా చర్యలు చేపట్టాలనేది పథక లక్ష్యం.



అలంకారప్రాయంగా వర్మీ కంపోస్టు భవనాలు

అయితే ప్రస్తుతం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కాస్త డంపింగ్ యార్డుగా మారింది. కేవలం అక్కడకు తరలించిన చెత్తను తగులబెట్టటం మాత్రమే చేస్తున్నారు. కొబ్బరి బొండాల పీచు వలిచే యంత్రం మూలనపడింది. ఇతర యంత్రాలదీ అదే పరిస్థితి. అన్నీ మూలనపడ్డాయి. ఆయా పరికరాలకు ఉన్న మోటార్లు దొంగల పాలయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టించడం అటుంచితే, కనీసం కుళ్లిన చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారు చేసేందుకు నిర్మించిన భవనాలు కూడా మూలనపడుతున్నాయి. దీంతో ఏ లక్ష్యంతో అయితే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారో ఆ లక్ష్యం నెరవేరడం అటుంచి ఆ ప్రాంతమంతా కాలుష్య కాసారంలా మారుతోంది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చెత్త శుద్ధి చర్యలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మిరపకు స్వస్తి .. పొగాకుపై ఆసక్తి

- మండలంలో పెరిగిన బర్లీ సాగు
- నష్టాలతో రూటు మార్చిన రైతులు

పంగులూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బర్లీ పొగాకు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మిరప సాగు తగ్గడం, రైతులు విస్తారంగా పొగాకు సాగుకు సన్నద్ధం కావడంతో పొగ నారుకు మార్కెట్లో గిరాకీ పెరిగింది. గత ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన రైతాంగం మంచి లాభాలు గడించడంతో అధిక శాతం రైతులు పొగాకు సాగుకు మొగ్గుచూపుతున్నారు. గత ఏడాది వెయ్యి నుంచి 1100ల ఎకరాలలో సాగయిన పొగాకు ఈ ఏడాది నాలుగు వేల ఎకరాలలో పొగాకు సాగయ్యే పరిస్థితి కనిపిస్తుంది. మిరప సాగులో పడిన కష్టాలు, చవి చూసిన నష్టాలతో రైతులు మిరప మంగళం పాడారు.



నారుమళ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగనారు



చందలూరు పొలంలో పొగ మొక్కలు నాటుతున్న కూలీలు

గత ఏడాది షుమారు రెండు వేల ఎకరాలలో మిరప సాగు చేసిన రైతాంగం ఈ ఏడాది 300 ఎకరాలకు పరిమితమయ్యారు. మిరపసాగులో పెరిగిన పెట్టుబడి, పురుగు, తెగుళ్ళ బెడదతో ఆశించిన దిగుబడులు రాని పరిస్థితితో పాటు మార్కెట్లో దిగజారిన ధరలతో మిరప సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూశారు. పొగాకు సాగులో పంట నష్టపోయే పరిస్థితి ఉండదని, సాగు చేసిన 60 రోజుల కాలవ్యవధిలో చేతికొచ్చిన పొగాకు అమ్మకాలతో రైతుకు కలిగే పెట్టుబడి ఎసులుబాటు, మార్కెట్లో పొగాకుకు ఉన్న గిరాకీతో రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో గత ఏడాది చందలూరులో 800 ఎకరాలలో మిరప సాగు చేసిన రైతులు ఈ ఏడాది 100 ఎకరాలకు పరిమతం కాగా, కొప్పెరపాడులో 300 నుంచి 50 ఎకరాలకు, నూజెళ్లపల్లిలో 600 నుంచి 350 ఎకరాలకు, బూదవాడలో 450 నుంచి 100 ఎకరాలకు మిరప సాగు తగ్గడం జరిగిందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.. పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు తెల్ల బర్లీ సాగు చేయాలనే సూచన చేస్తున్నప్పటికీ గత ఏడాది తెల్ల బర్లీ, నల్ల బర్లీ కొనుగోలులో వ్యత్యాసం లేక పోవడంతో దిగుబడి అధికంగా ఉండే నల్ల బర్లీ వైపు రైతాంగం మొగ్గు చూపుతున్నారు. మండల కేంద్రమైన పంగులూరు, చందలూరు, నూజెళ్లపల్లి, కొప్పెరపాడు, బూదవాడ పరిసర గ్రామాలలో పొగాకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు.

సాగు విస్తీర్ణం పెరగడంతో నారుకు పెరిగిన గిరాకీ

బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం పెరగడంతో మార్కెట్లో పొగ నారుకు గిరాకీ పెరిగింది. సాగు పెరగడంతో పాటు ముందుగా వేసిన పొలాలలో అధిక వర్షాలకు నాటిన పొగ మొక్కలు దెబ్బతినడంతో పొగనారుకు గిరాకీ పెరిగింది. పంగులూరులో పొగనారుకు గిరాకీ ఉంటుందని భావించిన పలువురు రైతులు బోర్ల కింద పొగనారును విస్తారంగా సాగు చేశారు. పొగ నాట్లు ముమ్మరం కావడంతో రైతులు నారుకోసం పొగ నారుమళ్ల వైపు పరుగులు పెడుతున్నారు.

నేతన్నల అభ్యున్నతికి కృషి చేస్తాం

డాక్టర్ హేమలత

కొత్తపేట (చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) నేతన్నల అభ్యున్నతికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని ఏపీ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత చెప్పారు. చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ముందుగా చీరాల పట్టణంలోని పలువురు మహనీయుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మృతి



మార్టూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు అమర్నేని హనుమంతరావు (60) అనారోగ్యంతో ఆదివారం మార్టూరులో ఇంటిలో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా కిడ్నీ సమస్య కారణంగా ఆయన బాధపడుతున్నారు. ఆయన మృతదేహానికి టీడీపీ మండల నాయకులు తొండెపు ఆదినారాయణ, బండి నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. ఇదిలావుండగా శనివారం హనుమంతరావు తండ్రి ఆంజనేయులు మృతిచెందారు.

ముస్లిం సామాజిక భవనానికి రూ.50లక్షలు

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో ముస్లిం సామాజిక భవనానికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయని పంచాయతీ రాజ్ జేఈ కె.మాధవ్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులు మంజూయ్యాయని త్వరలో టెండర్లు పూర్తి కాగానే నూతన భవన నిర్మాణ పనులు మొదలు పెడతామని ఏఈ తెలిపారు.

బొల్లాపల్లి జీఎన్‌టీ నుంచి నీరివ్వాలి

- ప్రణాళికను తయారు చేయాలంటున్న మార్టూరు గ్రామస్థులు
- తద్వారా వేగంగా చెరువుకు చేరనున్న నీళ్లు
- కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ
- అదే శాశ్వత పరిష్కారమంటున్న ప్రజలు



మార్టూరు రక్షిత మంచినీటి చెరువు (ఫైల్)

మార్టూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాతిక వేలకు పైగా జనాభా కలిగిన మేజర్ పంచాయతీ మార్టూరులో ప్రజల తాగునీటికి ఇబ్బందులు లేకుండా శాశ్వతమైన పరిష్కారం దిశగా గ్రామస్థులు ఆలోచన చేస్తున్నారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండాలంటే మొదటిగా మార్టూరు మంచినీటి చెరువులో పుష్కలంగా నీళ్లు ఉండాలి. మరి మంచినీటి చెరువులో నీళ్లు సమృద్ధిగా ఉండాలంటే ప్రస్తుతం చెరువుకు చేరుతున్న సాగర్ జలాలు దారి పూర్తి స్థాయిలో అనుకూలంగా లేదు. సాగర్ మెయిన్ కాలువ నుంచి మంచినీటి చెరువుకు నీళ్లు చేరడానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నెలరోజులకు పైగా సమయం పడుతున్నది. అంతే కాకుండా చెరువు కు తాగునీరు పెట్టే సమయంలో ప్రతిసారీ గ్రామ పంచాయతీకి లక్షల్లో డబ్బులు ఖర్చు అవుతున్నాయి. దానికి తోడు రా త్రింబవళ్లు పంచాయతీ కార్మికులు కాలువ గట్లపై, పొలాల వద్ద, చెరువు వద్ద నీటి కోసం కాపలా ఉండాల్సి వస్తుంది. అందువలన ప్రస్తుతం ఉన్న మార్గంలో కాకుండా చెరువుకు సాగ ర్ జలాలు చేరడానికి కొత్త ప్రణాళికను రూపొందించాల్సిన అ వ సరం ఉందని గ్రామస్థులు, గ్రామ ప్రజా ప్రతినిధులు అంటున్నారు.



మార్టూరు చెరువుకు నీరు రాకుండా రాజుపాలెం మేజర్‌లో నాగరాజుపల్లి తూము వద్ద వేసిన అడ్డుకట్ట (ఫైల్)

ప్రస్తుతం చెరువుకు చేరుతున్న సాగర్ జలాలు

30 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన మార్టూరు మంచినీటి చెరువుకు సాగర్ మెయిన్ కాలువ నుంచి రాజుపాలెం మేజరు ద్వారా సాగర్ జలాలు చేరుతున్నాయి. అంటే దాదాపుగా 10 కి.మీకి పైగా సాగర్ జలాలు ప్రయాణించి, మార్టూరు చెరువుకు నీళ్లు చేరతాయి. కానీ ఈ నీళ్ల ప్రయాణించే రాజుపాలెం మేజర్ ద్వారకపాడు, వలపర్ల, ఇసుకదర్శి గ్రామాల రైతులు పంట అవసరాలు కోసం నీళ్లను ఉపయోగించుకుంటారు. వాటిని దాటి సాగర్ జలాలు నాగరాజుపల్లి కాలువ వద్దకు వచ్చేసరికి, నాగరాజుపల్లి, రాజుపాలెం గ్రామస్థులు వారి పొలాలు, చెరువులతోపాటు అవసరాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలాసార్లు నాగరాజుపల్లి, రాజుపాలెం గ్రామాలకు చెందిన కొంతమంది ఏకంగా మార్టూరు చెరువుకు నీళ్లు వచ్చే తూము వద్ద అడ్డుకట్టగా ఇసుక బస్తాలు వేస్తున్నారు. ఈ విషయంలో పలుసార్లు మార్టూరు గ్రామ పంచాయతీ అధికారులకు రైతుల మధ్య వివాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తూము దగ్గర నుంచి మరో 3 కిమీ దూరం ప్రయాణించాకే మార్టూరు చెరువుకు నీళ్ల చేరుతాయి. ఈ కారణాలతో చెరువు నిండాలంటే నెలరోజులకు పైగా సమయం పడుతుండడం, ఈ వ్యవధిలో సాగర్ జలాలు ఆగిపోవడం జరుగుతున్నది. ప్రస్తుతం ఉన్న పథకం 2004లో మార్టూరు నియోజకవర్గం ఉన్న సమయంలో అప్పటి శాసనసభ్యుడు, ప్రస్తుత మంత్రి గొట్టిపాటి రవికుమార్ హయాంలో నిర్మాణం జరిగింది.

బొల్లాపల్లి వద్ద మెయిన్ కాలువ నుంచి చెరువుకు పైపులైను వేయాలి

బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద సాగర్ మెయిన్ కాలువ నుంచి భూమిలో అండర్ పైపులైన్‌ను మార్టూరు చెరువు వరకూ ఏర్పాటు చేయాలని, తద్వారా 15 నుంచి 20 రోజులలోనే చెరువు పూర్తిగా నిండుతుందని పంచాయతీ అధికారులు చెప్తున్నారు. గతంలోనూ 2014 నుంచి 2019 మధ్య కాలంలో అప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం బొల్లాపల్లి నుంచి చెరువుకు కొత్త పథకంపై అధికారులు పరిశీలన చేశారు. కానీ ఎందుకనో అది ఆచరణలోకి రాలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త పథకంపై ప్రజల్లో చర్చ సాగుతోంది. ఈ విషయమై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై ప్రజలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. కొత్త పథకం అమలైతే మార్టూరు చెరువులో పూర్తి స్థాయిలోకి నీరు చేరి, ప్రజలకు వేసవి కాలంలో కూడా తాగునీటికి ఇబ్బంది ఉండదని అంటున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

దాతల తోడ్పాటుతో ఉన్నతంగా ఎదగాలి

చీరాలటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు దాతలు అందించే తోడ్పాటును వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో ఐదుగురు పేద విద్యార్థినులకు రోటరీ క్లబ్‌ఆఫ్ హైదరాబాద్ నార్త్ ప్రతినిధులు సైకిళ్లను పంపిణీ చేశారు. స్థానిక నవాబ్‌పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో సైకిళ్లను బాలికలకు అందజేశారు అనంతరం మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు అవకాశాలు ఉపయోగించుకుని ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి రవితేజ్, సభ్యులు దేవరాజ్, రమణ, రామకృష్ణరమణారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంప్

చినగంజాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఆధార్ మొబైల్ క్యాంపులను ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి ఆదివారం తెలిపారు. 11వ తేదీన సంతరావూరు గ్రామ సచివాలయంలో సంతరావూరు, గొనసపూడి, 12న కడవకుదురు గ్రామ సచివాలయంలో కడవకుదురు, మోటుపల్లి, 13న చినగంజాం గ్రామ సచివాలయంలో చినగంజాం, పల్లెపాలెం, మున్నంవారిపాలెం, 14న కొత్తపాలెం గ్రామ సచివాలయంలో కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, 15న పెదగంజాం గ్రామ పచివాలయంలో ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి లోపు పిల్లలకు పుట్టినరోజు సరిజేయాలంటే ఆన్‌లైన్ చేసిన పుట్టినరోజు సర్టిఫికెట్ కావాలని, వాళ్ల తండ్రి లేక తల్లి వచ్చి వేలిముద్ర వేయాలని, ఇంటర్ చదివే విద్యార్థులకు పేరు సరిచేయాలంటే పదో తరగతి మార్కుల లిస్ట్ ఒరిజినల్ తెచ్చుకోవాలని, పుట్టిన రోజుని సరి చేయాలంటే పుట్టిన రోజు సర్టిఫికెట్ తీసుకొని రావాలని తెలిపారు. గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో క్యాంపులు జరిగే ముందు రోజు టాంటాం, ఇతర ప్రచార సాధనాల ద్వారా ఆధార్ నమోదు గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్సు అధికారులు ఆదివారం బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి 126 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి నుంచి వచ్చిన స్టేట్ టాస్క్‌ఫోర్సు బృందం ఆదివారం అద్దంకి మండలం ధర్మవరంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న శ్రీరాములు వద్ద నుంచి 106 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అద్దంకి ఎక్సైజ్ సీఐ భవాని, ఎస్సై విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బల్లికురవలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పి.ఏడుకొండలు వద్ద 12 బాటిళ్ల, ఎం.రంగారావు వద్ద 18 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తున్నారు.

మత్తు తలకెక్కింది!

- రామాపురం సముద్రతీరంలో యువకుడి హల్‌చల్
- ప్రమాదం నుంచి రక్షించిన పోలీసులు
- ఏరియా వైద్యశాలకు తరలింపు



ఏరియా వైద్యశాలలో అపస్మారక స్థితిలో గోపీ

రామాపురం (చీరాలటౌన్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సరదాగా స్నేహితులతో రామాపురం సముద్రతీరంలో ఈతకు వచ్చి మద్యం మత్తులో యువకుడు హల్‌చల్ చేశాడు. ఈక్రమంలోనే ప్రమాదబారిన పడుతున్నట్లు గ్రహించిన పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పసుమర్తికు చెందిన గుంజి గోపీ తన తమ్ముడు అంకమ్మరావు, స్నేహితులు శ్రీకాంత్, శ్రీనుతో కలిసి నలుగురు రెండు ద్విచక్ర వాహనాలపై రామాపురం బీచ్‌కు ఆదివారం వచ్చారు. ఈక్రమంలో మద్యం సేవించిన గోపీ సాధారణ స్థితిని కోల్పోయాడు. దీంతో సముద్రంలోకి వెళ్లి హల్‌చల్ చేశాడు. నీళ్ల తాగి అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే స్పందించిన రూరల్ ఏఎస్సై శివకుమారి, మెరైన్ పోలీసులు అతడిని సముద్రంలో నుంచి బయటకు తెచ్చారు. వెంటనే 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలోనే ఉన్నాడు.

ప్రమాదాల బారిన పడకండి

- శేషగిరిరావు, రూరల్ సీఐ

కార్తీకమాసం సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు, మందు బాబులు జాగ్రత్తలు పాటించాలి. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు చేయాలి. భిన్నంగా వ్యవహరించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. సముద్రతీరంలో భక్తుల రక్షణ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. గట్టి బందోబస్తును ఏర్పాటు చేశాము.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి

మార్టూరు, నవంబరు10(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తమ్ములూరి నాగేశ్వరరావు (45) అనే ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో మార్టూరు సెంటర్లో స్టేట్‌బ్యాంక్ ముందు సర్వీసురోడ్డులో జరిగింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.అతను మండలంలోని రాజుపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందినవారు.అతను టీవీఎస్ వాహనంపై మార్టూరు సెంటరు కు వచ్చిన సమయంలో వెనుకవైపు నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఎస్‌ఐ సైక్ సైదా సంఘటనా స్థలానికి చేరి, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మార్టూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ హైస్కూల్‌లో 1983-84 సంవత్సరం 10 వతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల పరిధిలోని రాజుపాలెం రోడ్డు వద్ద శ్రీ సాయి బాలాజీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి ఘంటసాల బంగారుబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కాకోలు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఒకే వేదికలో కలిసిన వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అడుగుల రామాయాచారి, ఎం.పిచ్చయ్య శర్మ, పీ తిరుపతమ్మను ఘనంగా సన్మానించారు. ఉత్తమ విద్యార్థులైన యక్కల మోహిని, మద్దు శ్రీనివాసరావును వారు సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బత్తుల వెంకటేశ్వర్లు, ముప్వా మధు సూదనరావు, జాష్టి సాంబ శివరావు, మద్ది రంగ, జీ బుల్లెంకమ్మ, పొత్తూరి రమేష్, అరుణ, పద్మావతి పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఓటర్ల జాబితాను ప్రచురిస్తున్న అధికారులు

నీటి సంఘాల ఓటర్ల జాబితా సవరణ

పర్చూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఆదివారం ప్రకటన విడుదల చేసినట్లు తహసీల్దార్ పీ బ్రహ్మయ్య తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందన్నారు.. ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ సారథ్యంలోని సిబ్బంది మండలంలోని ఉప్పుటూరు, నూతలపాడు, చెరుకూరు, రమనాయపాలెం గ్రామ సచివాలయాల్లో ఓటర్ల జాబితాకు సంబంధించిన నోటీసులను అంటించారు. రైతులు ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలన్నారు. సంబంధిత గ్రామాల రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 11, 12 తేదీలలో రెవెన్యూ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ఈనెల 13న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని బాపట్ల జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. ఆదివారం బల్లికురవ మండల కేంద్రంలో మండల శాఖ అధ్యక్షుడు నాగబోయిన సింగారావు అధ్యక్షతన మండల రైతు సంఘ సమావేశం జరిగింది. రామారావు మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న చివరి భూములకు సాగు నీరు సక్రమంగా అందడం లేదన్నారు. పలుచోట్ల డీఏపీ ఎరువులు అందుబాటులో లేవన్నారు. పంటల బీమా సొమ్మును ప్రభుత్వమే చెల్లించాలని, జీరో వడ్డీ రాయితీలు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు, రైతులు చింతల సుబ్బారావు, అంజయ్య పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పర్చూరులో యోగా చేస్తున్న చిన్నారులు

పర్చూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే యోగా చేస్తే మంచి దేహదారుఢ్యంతోపాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని కతారి సత్యనారాయణ అన్నారు. ఆదివారం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శిక్షకుడు సత్యనారాయణ నేతృత్వంలో చిన్నారులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు, ఆరోగ్యంపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. యోగాతోపాటు, ధ్యానం కూడా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొసనా వెంకటేశ్వర్లు, కాసా అజేయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ఆకలి కేకలు

- గ్యాస్ సిలిండర్ రాక ఆలస్యంగా అల్పాహారం
- ఇటీవల ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనలో వెలుగు చూసిన లోపాలు
- అయినా మారని నిర్వాహకుల తీరు



సిలిండర్ కోసం పడిగాపులు కాస్తున్న వంట సిబ్బంది

చీరాలటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని జాతీయ రహదారి ఈపూరుపాలెం వద్ద గల కేజీబీవీ స్కూల్ విద్యార్థులు ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. శనివారం రాత్రే గ్యాస్ సిలిండర్ కొరత ఏర్పడింది. ఈక్రమంలో ఆదివారం ఉదయానికి అప్రమత్తమై జాగ్రత్తలు చేపట్టాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఉదయం ఎనిమిది గంటలకు అందించాల్సిన అల్పాహారం 10 గంటల వరకు అందలేదు. దీంతో హాస్టల్లో ఉన్న సుమారు 250 మంది విద్యార్థినులు ఆకలితో అలమటించారు. సమాచారం అందుకున్న మీడియా ప్రతినిదులు అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అయితే విషయం ఎక్కడ వైరల్ అవుతుందోనని హాస్టల్లో ఆడపిల్లలున్నారంటూ గేట్లు మూసేశారు. అయితే అప్పటికే విషయం కలెక్టర్ వెంకటమురళి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆగ్రహించినట్లు సమాచారం. దీంతో అప్పుడు చలనం కలిగిన నిర్వాహకులు గ్యాస్ ఏజెన్సీ వారిని సంప్రదించి అప్పటికప్పుడు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల సాక్షాత్తు ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటనలో సైతం కుళ్లిన కూరగాయలు వంటకు సిద్ధంగా ఉన్న విషయం తెలిసిందే. అయినా వీరి తీరు మారకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో కొప్పెరపాడు విద్యార్థులకు ప్రథమస్థానం

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. శని, ఆదివారాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విశాఖలో జరిగింది. బాపట్ల జిల్లా నుంచి బల్లికురవ మండలం కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 22 జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు క్విజ్, టాలెంట్ టెస్ట్, ప్రయోగాలు నాలుగు విభాగాలలో జరిగిన సైన్స్ పోటీలలో కొప్పెరపాడు పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.సాయిచరణ్ తేజ, బీ కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. వారికి నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా సైన్స్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, పి.బాలాజీ, పి. జానకిరాందాస్, పి.విజయరోజ్‌తోపాటు విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అభినందించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువకుడి అదృశ్యంపై వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పందిళ్లపల్లికి చెందిన పి.వెంకటేశ్వర్లు(23) గత నెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో అతని తండ్రి పుల్లయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆంజనేయరాజుకు కళాపురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

నటనతో అద్దంకికి ఖ్యాతిని తెచ్చిన ఆంజనేయరాజు

అద్దంకిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి శ్రీరామమూర్తి మొదలు బండారు రామారావు, పుట్టంరాజు శంకరరావు, అద్దంకి మాణిక్యాలరావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు వంటి నటులు తమ నటనా ప్రతిభతో అద్దంకికి ఖ్యాతిని తెచ్చిపెట్టారని సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్తు అన్నారు. ఆదివారం స్థానిక మారంవారి సేవా సదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ కళాపురస్కార సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జానపద పురాణ పాత్రలలో అద్భుతంగా నటించి రంగస్థల రంగానికి ఎనలేని ఖ్యాతిని తెచ్చిన వారిలో ఆంజనేయరాజు ఒకరని కొనియాడారు. సినిమా, బుల్లితెర ఆవిర్భావం వల్ల కళాకారుల జీవన పరిస్థితులు అధ్వానంగా మారాయని, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళలను బతికించుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందని డీవీఎం సత్యనారాయణ అన్నారు. కళే దైవంగా, జీవనోపాధిగా బతుకు వెళ్లదీసిన వృత్తి కళాకారులను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ మంజూరు చేయాలని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి విజ్ఞప్తి చేశారు. అనంతరం మిద్దెబోయిన ఆంజనేయరాజుకు కళాపురస్కారంతో ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, శైలజ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ యూ దేవపాలన, శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, మురళీసుధాకరరావు, శ్రీనివాసరావు, సీసీహెచ్ కోటయ్య, నాగేశ్వరరావు, రాఘవరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా, ఉత్సాహంగా కార్తీక వనభోజనాలు

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాలను పలు సామాజిక వర్గాలకు చెందినవారు వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. రామాపురం తీరంలోని ప్రైవేటు రిసార్ట్‌లో కమ్మవారి వనభోజనాలు జరిగాయి. వేటపాలెం బైపాస్ రోడ్డు సమీపంలో వేంచేసివున్న గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం వద్ద రజక బంధుజన కార్తీక వనభోజనాలు జరిగాయి. చీరాల ఎంజీసీ మార్కెట్‌లో ఆర్యవైశ్యుల కార్తీక వనభోజనాలు కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఆయా కార్యక్రమాలకు హాజరైనవారు పరస్పరం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. పాల్గొన్న వారికి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.